

పెద్దాస్పత్రికి సిబ్బంది కొరత



- కేజీహెచ్‌కు మంజూరైన స్టాఫ్ నర్సు పోస్టులు **712**
- ప్రస్తుతం ఉన్నది **615** మంది
- అందులో ఆరోగ్య సమస్యలు, ఇతర కారణాలతో వంద మంది సెలవులో...
- మిగిలింది 515 మందే...
- రోగులకు అందించాల్సిన సేవలపై తీవ్ర ప్రభావం
- నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ఉండాల్సిన స్టాఫ్ నర్సుల సంఖ్య 1,200

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి):

కింగ్ జార్జ్ ఆస్పత్రిని నర్సింగ్ సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఈ సమస్యను ఎమ్మెల్యేలు ఇటీవల ఆరోగ్య శాఖా మంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో 30కి పైగా విభాగాలు ఉండగా, ప్రతిరోజూ రెండు వేల మంది వరకు అవుట్ పేషెంట్‌లుగా సేవలు పొందేందుకు వస్తుంటారు. మరో 1,600 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా వైద్య సేవలు పొందుతుంటారు. రోజుకు ఓపీ, ఐపీ కలిపి సుమారు 3,500 మందికిపైగా వైద్య సేవలు పొందుతున్నారు. అయితే, రోగుల సంఖ్యకు అనుగుణంగా నర్సింగ్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ప్రతి ఐదు పడకలకు ఒక స్టాఫ్ నర్స్, ఐసీయూలో ఒక్కొక్క బెడ్‌కు ఒక్కొక్క స్టాఫ్ నర్స్ అందుబాటులో ఉండాలి. ఆ లెక్కన చూస్తే..ప్రస్తుతం కేజీహెచ్‌లో ఉన్న ఐసీయూ, సాధారణ బెడ్స్ కోసం 1,200 మంది వరకు స్టాఫ్ నర్సులు ఉండాలి. కానీ, కేజీహెచ్‌లో 712 స్టాఫ్ నర్సు పోస్టులు ఉండగా, ప్రస్తుతం 615 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇందులో కూడా ఆరోగ్య సమస్యలు, ఇతర కారణాలతో కనీసం వంద మంది సెలవుల్లో ఉంటున్నారు. మిగిలిన 515 మంది మూడు షిప్టుల్లో పనిచేయాల్సి వస్తోంది. అంటే ఒక్కో షిప్టులో 172 మంది ఉంటున్నారు. దీనివల్ల వైద్య సేవలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్టు చెబుతున్నారు. వార్డుల్లో స్టాఫ్ నర్సులు అందించే సేవలు అత్యంత కీలకం. వైద్యులు చూసి వెళ్లిన తరువాత మెడిసిన్ ఇవ్వడం, ఫాలోఅప్ చేయడం అంతా వారి బాధ్యతే. అటువంటి కీలకమైన సిబ్బంది తక్కువగా ఉండడంతో రోగులకు అరకొరగా వైద్య సేవలు అందే పరిస్థితి నెలకొంది.

ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వో కొరత..

ఆస్పత్రిలో చేరే రోగులను వార్డులకు ... మిగతా 6వ పేజీలో

సీఐల కలెక్షన్!?

తమ చేతికి మట్టి అంటకుండా కానిస్టేబుల్/హెడ్‌కానిస్టేబుల్/రైటర్‌లలో ఎవరో ఒకరికి బాధ్యత అప్పగింత

- పోలీస్ కమిషనరేట్‌లో సగానికిపైగా స్టేషన్లలో ఇదే పరిస్థితి
- అవినీతి వ్యవహారం సీపీ దృష్టికి చేరినా కానిస్టేబుళ్లపైనే వేటు
- చర్యల నుంచి తప్పించుకుంటున్న స్టేషన్ ఆఫీసర్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కొన్ని స్టేషన్లలో కలెక్షన్ ఏజెంట్లు తయారయ్యారు. ఆయా స్టేషన్ల సీఐలే తమకు నమ్మకస్తులుగా ఉండే కానిస్టేబుల్/హెడ్ కానిస్టేబుల్‌ను వసూళ్ల కోసం ప్రత్యేకంగా నియమించుకుంటున్నారు. స్టేషన్‌కు వచ్చే కేసులు, సివిల్ సెటిల్‌మెంట్లలో వారి ద్వారానే డబ్బులు గుంజుతున్నారు. అయితే అవినీతి వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినప్పుడు...సంబంధిత కానిస్టేబుల్/హెడ్ కానిస్టేబుల్ మాత్రమే చర్యలకు గురవుతున్నారు. వసూళ్లకు సూత్రధారులైన సీఐలు మాత్రం తప్పించుకుంటున్నారు. అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేంది లేదని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పదేపదే హెచ్చరిస్తున్నా సీఐలు తమ దందా నిరాటంకంగా కొనసాగిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలకు సంబంధించి 22 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఆయా స్టేషన్లకు సీఐలు స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)లుగా వ్యవహరిస్తుంటారు. స్టేషన్‌కు వచ్చే సివిల్, ఇతర కేసులకు సంబంధించి ఇరు వర్గాలతో మాట్లాడి సెటిల్ చేసే బాధ్యతను సీఐలు వెనకుండి ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలతో నడిపిస్తున్నారు. ఈ క్రమంలో కేసు కట్టకుండా సెటిల్ అయిపోయిన ఫిర్యాదుల్లో ఇరుపక్షాల నుంచి స్టేషన్ ఖర్చులని, ఉన్నతాధికారులకు ఇవ్వాలని చెప్పి డబ్బులు గుంజేస్తున్నారు. అయితే కేసు లేకుండా సెటిల్ చేస్తామని లేదా ఒక వర్గానికి మేలు జరిగేలా చూస్తామని చెప్పి డబ్బులు వసూలుచేసే బాధ్యతను కొన్ని స్టేషన్లలో సీఐలు తమకు నమ్మకస్తులుగా ఉన్న కానిస్టేబుల్/హెడ్ కానిస్టేబుల్ లేదా రైటర్లుగా వ్యవహరించే వారికి అప్పగిస్తున్నారు. ఎప్పుడైనా డబ్బులు తీసుకున్న విషయం పొరపాటున బయటపడినా తమ చేతికి మట్టి అంటదని సీఐలు జాగ్రత్త పడుతున్నారు. సీపీగా శంఖబ్రతబాగ్చీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొద్దిరోజులు సీఐలు వెనక్కి తగ్గినప్పటికీ తర్వాత మళ్లీ యథావిధిగా వసూళ్ల పర్వాన్ని సాగిస్తుండడం విశేషం. నార్త్ సబ్ డివిజన్ పరిధిలో భూ వివాదాలు, సివిల్ కేసులు ఎక్కువగా వచ్చే స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అతన్ని మార్చేస్తారని ప్రచారం జరిగినా ఇంతవరకూ ఏమీ కాలేదు. సదరు అధికారి స్టేషన్‌లో జనరల్ బాధ్యతలు చూస్తున్న ఒక హెడ్ కానిస్టేబుల్‌ను కేవలం వసూళ్లకు ఏజెంట్‌గానే వినియోగిస్తున్నారని అక్కడి సిబ్బందే చెబుతున్నారు. సదరు హెడ్ కానిస్టేబుల్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల నుంచి ఉన్నతాధికారుల పేరుతో వీలైనంత వసూలుచేసి సీఐకు ఇస్తుంటారని ఆరోపిస్తుండడం విశేషం. ద్వారకా సబ్‌డివిజన్ పరిధిలో సంపన్నులు ఎక్కువగా ఉండే ప్రాంతానికి చెందిన స్టేషన్ సీఐపైనా పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌ను 'అచ్చం'గా వసూళ్ల కోసమే నియమించుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం గత సీపీ దృష్టికి వెళ్లడంతో ఆయన మందలించారు. దీంతో కొద్దికాలం ఆ ఏజెంట్‌ను దూరంపెట్టారు. ఆయన బదిలీ కాగానే మళ్లీ తెచ్చిపెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నారని సిబ్బంది చెబుతున్నారు. హార్బర్ ప్రాంతంలో సీఐ ఒకరు..ఇన్‌స్పెక్టర్ రైటర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్ ద్వారా వసూళ్ల దందా సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్టేషన్‌లో బాధ్యతలు కంటే వసూళ్ల బాధ్యతలే సదరు కానిస్టేబుల్‌కు 'సంతోషం'గా ఉండడంతో ఆ పనిలోనే నిమగ్నమై ఉంటారని సిబ్బంది చెబుతున్నారు. ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని ఒక పోలీస్ స్టేషన్ సీఐపై తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివాదాస్పదమైన అధికారిగా పేరొందిన సదరు సీఐ స్టేషన్‌లో వసూళ్ల కోసం ఏకంగా తన వాహనం డ్రైవర్‌తోపాటు రైటర్‌గా పనిచేస్తున్న ఏఎస్‌ఐను వినియోగించు కుంటున్నట్టు పోలీస్ శాఖకు చెందిన కొందరు అధికారులు చెబుతున్నారు. వసూళ్ల బాధ్యతలు చూస్తున్న ఏఎస్‌ఐ స్టేషన్‌లో ఎలాంటి విధులు నిర్వర్తించకుండా తమకు మాత్రం పనులు చెబుతున్నాడంటూ అదే స్టేషన్‌లో పని చేస్తున్న మరొక ఏఎస్‌ఐ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టడం చర్చనీయాంశమైంది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా సరే సీఐ తనకున్న పలుకుబడితో సీపీ వరకూ వెళ్లకుండా ఆపుకోగలిగారని స్టేషన్ సిబ్బంది చెబుతున్నారు. అనకాపల్లి జిల్లాలో ఉన్నప్పటికీ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే కొనసాగుతున్న ఒక పోలీస్ స్టేషన్‌లో బ్లూకోల్ట్ కానిస్టేబుల్‌ను వసూళ్ల కోసం సీఐ నియమించుకున్నారు. దీనిపై గతంలో కూడా ఫిర్యాదులు రావడంతో అయన్ను ఏఆర్‌కు అటాచ్‌మెంట్ చేశారు. అతని స్థానంలో వచ్చిన మరొక కానిస్టేబుల్‌కు ఇప్పుడు వసూళ్ల బాధ్యతలు అప్పగించారు. ఈ విధంగా సీఐలు తాము నేరుగా కాకుండా ఏజెంట్లుగా నియమించుకున్న కానిస్టేబుల్/హెడ్ కానిస్టేబుల్ ద్వారా వసూళ్లు కొనసాగిస్తున్నారు. ఇటీవల పద్మనాభం పోలీస్ స్టేషన్ రైటర్‌గా పనిచేస్తున్న ... మిగతా 6వ పేజీలో

నేడు ఏయూకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి

- వీసీతో పాటు అధికారులతో సమీక్ష

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరభ్‌కుమార్ గౌర్ మంగళవారం ఆంధ్ర యూనివర్సిటీకి రానున్నారు. వీసీతో పాటు ఇతర అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. సౌరభ్‌కుమార్ రాక నేపథ్యంలో హెచ్‌వోడీలు, ఫ్యాకల్టీ, ఇతర సిబ్బంది ఉదయం 8.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అందుబాటులో ఉండాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌చార్జి వీసీ బాధ్యతలు స్వీకరించిన కొద్దిరోజులకే ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వర్సిటీకి వస్తుండడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇక్కడి వ్యవహారాలను నేరుగా పరిశీలించి విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్‌కు నివేదిక సమర్పించే అవకాశం ఉంది. మంత్రి సూచనల మేరకే ఆయన వస్తున్నట్టు చెబుతున్నారు. సౌరభ్ కుమార్ వచ్చి వెళ్లిన తరువాత వర్సిటీలో కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశముందన్న చర్చ సాగుతోంది. ముఖ్యంగా గత పాలకుల అడ్డగోలు వ్యవహారాలు, నియామకాలు, నిధులు దుర్వినియోగంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించనుందని ప్రచారం జరుగుతోంది. ఇదిలావుండగా వర్సిటీలోని ఇబ్బందులు, గత పాలకులు చేసిన అడ్డగోలు వ్యవహారాలు, నియామకాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లేందుకు పలువురు సిద్ధమవుతున్నారు.

అప్పన్నకు 350 గ్రాముల స్వర్ణ హారం బహూకరణ



స్వర్ణ హారాన్ని అధికారులకు అందజేస్తున్న భక్తుడు సూర్యచంద్రరావు

సింహాచలం, జూలై 29: వరాహ లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక సందర్భాల్లో అలంకరణకు వినియోగించాలని కోరుతూ విశాఖ నగర పరిధిలోని మధురవాడ ప్రాంతానికి చెందిన భక్తుడు కె.సూర్యచంద్రరావు సోమవారం స్వర్ణ హారాన్ని బహూకరించారు. అధికారులు హారాన్ని తూకం వేసి 350 గ్రాములు ఉన్నట్టు నిర్ధారించారు. దేవస్థానం ఈఓ. సింగాల శ్రీనివాసమూర్తికి సూర్యచంద్రరావు ఆ హారాన్ని అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయంలో స్వామివారి దర్శనం కల్పించి, వారి గోత్రనామాలతో పూజలు జరిపించారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఆలయ ఏఈఓ. ఆనందకుమార్ దాతను శాలువాతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి ఏయూ దూరవిద్య పరీక్షలు

- కొన్ని కేంద్రాల్లో డబ్బులు వసూలు?

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏయూ దూర విద్య కేంద్రం విద్యార్థులకు మంగళవారం నుంచి వచ్చే నెలాఖరు వరకు పరీక్షలు జరగనున్నాయి. ఎంఏ, ఎంబీఏ, ఎంకాం విద్యార్థులకు మొదటి, రెండు, మూడు సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. అయితే, ఈ పరీక్షలను క్యాష్ చేసుకునేందుకు అనేక కళాశాలలు సిద్ధమయ్యాయి. పరీక్ష కేంద్రాలు కలిగిన కొన్ని కళాశాలలు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలుచేసి ప్రశ్నపత్రాలను ముందుగానే లీక్ చేస్తున్నాయి. ఈ తరహా వ్యవహారాలకు ఆస్కారం లేకుండా ఏయూ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. దీనిపై వివరణ కోరేందుకు యత్నించగా ఏయూ దూర విద్యా సంచాలకులు అందుబాటులోకి రాలేదు.

ఒకేలా జవాబుపత్రాలు...

కొన్ని పరీక్ష కేంద్రాల్లో పేపర్లు ముందుగానే విద్యార్థులకు చేరుతున్నాయని తెలిసింది. ఆయా కేంద్రాల్లో విద్యార్థుల సమాధానాలు ఒకేలా ఉంటున్నాయి. గతంలో నిర్వహించిన పరీక్షల వాల్యుయేషన్‌కు వెళ్లిన అధ్యాపకులు జవాబుపత్రాలు చూసి ఆశ్చర్యపోయారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో ముందుగానే పేపర్ లీక్ చేయడం లేదా మాస్‌కాపీయింగ్ అవకాశం కల్పించడమే అందుకు కారణంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దూర విద్యా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్న డిమాండ్ వినిపిస్తోంది.

ఈపీడీసీఎల్‌లో ఇంటిదొంగలు

ఈపీఎఫ్ సొమ్ము దారి మళ్లింపు వెనుక ఓ అధికారి

- రూ.29 లక్షలు మాయం కేసులో కింది వారిపైనే చర్యలు
- వేరే ఖాతాలకు మళ్లించాల్సిందిగా జోన్ అధికారి లేఖలు
- విచారణలో వెల్లడించిన బ్యాంకు అధికారులు
- పోలీసుల దర్యాప్తును పక్కదోవ పట్టించిన ఉన్నతాధికారులు
- ఇలాంటి తప్పుడు లెక్కలు ఇంకా ఎన్ని జరుగుతున్నాయో?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో ఇంటి దొంగలు ఎక్కువయ్యారు. ఉన్నతాధికారుల అండ చూసుకొని తోటి ఉద్యోగులకే ఎసరు పెడుతున్నారు. భారీగా నిధులు మళ్లించి కాజేయాలని యత్నిస్తున్నారు. తప్పులు బయటపడితే కింది వారిని బలి చేసి వారు మాత్రం సచ్ఛీలురుగా చలామణీ అవుతున్నారు. విశాఖ జోన్-3 (మధురవాడ) కార్యాలయంలో రెండేళ్ల క్రితం జరిగిన నిధుల గోల్‌మాలే దీనికి నిదర్శనం. ఈ కేసులో పోలీసులకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో వారు కూడా తూతూమంత్రంగానే దర్యాప్తు నిర్వహించారు.



విశాఖ జోన్-3 (మధురవాడ) కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసే పప్పు సంతోష్ సత్యనారాయణమూర్తి వంద మందికి పైగా ఉద్యోగుల ఖాతాలకు జమ చేయాల్సిన రూ.29 లక్షల ఈపీఎఫ్ సొమ్మును తన వ్యక్తిగత ఖాతాలో వేసుకున్నాడు. ఇది ఒక్కసారిగా కాకుండా దఫదఫాలుగా చేసుకుంటూ వచ్చాడు. 2020 ఏప్రిల్ 9న రూ.1,99,884 వ్యక్తిగత ఖాతాకు మళ్లించాడు. ఆదేరోజు ఉద్యోగుల ఖాతాలో జమ చేశాడు. మరుసటి నెల 2020 మే 8న మళ్లీ రూ.14,24,904 తన ఖాతాలో వేసుకున్నాడు. ఐదు రోజులు ఆగి ఉద్యోగుల ఖాతాలో జమ చేశాడు. మళ్లీ 2021 జూన్ 22న రూ.4,60,883 సొంత ఖాతాకు మళ్లించాడు. ఈ మొత్తం ఉద్యోగుల ఖాతాలో జమ చేయకుండానే మళ్లీ 2021 నవంబరు 20న రూ.26,46,769 తన ఖాతాలో వేసుకున్నాడు. ఆ రూ.29,07,652 ఉద్యోగుల ఖాతాకు జమ చేయకుండా వాడేసుకున్నాడు. ఎనిమిది నెలలుగా ఈపీఎఫ్ మొత్తం ఖాతాల్లో జమ కావడం లేదని గుర్తించిన ఆ జోన్‌లోని ఉద్యోగులు ఒకరికి మరొకరు చెప్పుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆ నోట ఈ నోట కార్పొరేట్ కార్యాలయానికి తెలియడంతో అప్పటి విశాఖ సర్కిల్ ఎస్ఈని విచారణ జరపాల్సిందిగా పంపించారు. ఆ జోన్‌కు బాధ్యత వహిస్తున్న అధికారికి పెద్దస్థాయిలో పరిచయాలు ఉండడంతో తప్పంతా అటెండర్ సత్యనారాయణదిగా తేల్చి అతడిని సస్పెండ్ చేశారు. ఈ విషయం బయటకు రాగానే సదరు అటెండర్ అదృశ్యమైపోయాడు. అతడు అటెండరే అయినప్పటికీ ఉన్నతాధికారి డిజిటల్ సైన్ ఉపయోగించి అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్నాడని, అనధికార వ్యవహారాలు నడుపుతున్నాడని విచారణలో అధికారుల దృష్టికి వచ్చింది. ఆ తరువాత మరో కమిటీని వేయడంతో వారంతా అక్కడ పనిచేస్తున్న అకౌంట్స్ అధికారుల నిర్లక్ష్యం ఉందని తేల్చి ముగ్గురిని ఏజెన్సీలోని పాడేరు బదిలీ చేశారు. ఈలోగా సంతోష్‌ని పట్టుకొని ఆ డబ్బులు రికవరీ చేసి ఉద్యోగుల ఖాతాకు జమ చేశారు.

పోలీసులను పక్కదారి పట్టించారు

రూ.29 లక్షలు మాయం అయితే దీనిపై పత్రికల్లో వార్తలు వచ్చిన తరువాత మాత్రమే పోలీసులకు జోన్-3 అధికారులు ఫిర్యాదు చేశారు. తప్పనిసరి స్థితిలో రెండే రెండు లైన్లతో ఫిర్యాదు ఇవ్వడంతో పీఎం పాలెం పోలీసులు అసలు ఈ ఉద్యోగి ఎవరు?, ఎన్నాళ్ల నుంచి పనిచేస్తున్నారు?...అనే వివరాలు ఏమీ లేవని, బ్యాంకు ఖాతా నుంచి ఆయన వ్యక్తిగత ఖాతాకు నిధులు ఎలా వెళ్లాయని అడిగితే జోన్-3కి బాధ్యత వహిస్తున్న అధికారి సమాధానం ఇవ్వలేదు. దీంతో పోలీసులు సదరు బ్యాంకుకు వెళ్లి విచారణ కూడా చేయలేదు. ఈపీడీసీఎల్ అధికారులు బాధ్యులపై చర్యలు చేపట్టారనే ఉద్దేశంతో తూతూమంత్రంగా నివేదిక రూపొందించి ఊరుకున్నారు.

తీగ లాగితే డొంక కదిలింది

లక్షలాది రూపాయల ఈపీఎఫ్ సొమ్ము వ్యక్తిగత ఖాతాలకు మళ్లించడం ఏమిటి?, ఇది ఎలా జరిగింది? ఎందుకు చేశారు? ఎవరు సహకరించారనే అంశాలపై ఈపీఎఫ్ అధికారులు ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపారు. ఎవరి ఆదేశం మేరకు బ్యాంకులో సొమ్ము వేరే ఖాతాకు వెళ్లిందని ఆరా తీస్తే..సదరు జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీరే (ఈఈ) తమకు లేఖలు రాశారని, ఆ ప్రకారం సూచించిన మొత్తాలను బదిలీ చేసినట్టు తేదీలు, ఈఈ రాసిన లేఖల నంబర్లతో సహా ఎస్‌బీఐ సూర్యాబాగ్ బ్రాంచి మేనేజర్ నివేదిక ఇచ్చారు. డిపార్టుమెంట్‌కు చెందిన ఆన్‌లైన్ ఖాతా నంబరు 62416379904 నుంచి పప్పు సంతోష్ సత్యనారాయణమూర్తి వ్యక్తిగత ఖాతా నంబరు 62361935250 బదిలీ చేశామని ట్రాన్సాక్షన్ వివరాలతో నివేదిక ఇచ్చారు.

డిపార్ట్‌మెంట్‌కు చెందిన మొత్తాన్ని లక్షల రూపాయల్లో అటెండర్ వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేయాల్సిందిగా ఈఈ ఎందుకు కోరారు?, దీని వెనుక ఉద్దేశం ఏమిటి? అనేది బయటకు రాలేదు. దీనిపై ఈఈని ఇంతవరకూ ఎవరూ విచారించలేదు. పోలీసులకు కూడా ఈ విషయం ఇప్పటివరకూ తెలియకపోవడం గమనార్హం. ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులకు తెలిసినా ఈఈపై చర్యలు చేపట్టలేదు. ఈ కేసులో తప్పు చేశారని కొందరిని ... మిగతా 6వ పేజీలో

స్టాండింగ్ కమిటీకి 15 నామినేషన్లు


- కూటమి నుంచి పది, వైసీపీ నుంచి ఐదు
- నామినేషన్లు దాఖలుకు నేడు చివరిరోజు

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పోటీకి 15 మంది కార్పొరేటర్లు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో పది మంది కూటమి తరఫున, ఐదుగురు వైసీపీ తరఫున నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్లు దాఖలుకు మంగళవారంతో గడువు ముగుస్తుంది. కూటమి తరఫున పది మంది అభ్యర్థులను ఎంపిక చేయడానికి మూడు పార్టీల నేతలు గత మూడు రోజులుగా తీవ్రస్థాయిలో కసరత్తు చేశారు. ఆశావహులు ఎక్కువ మంది ఉండడంతో వారందరినీ బుజ్జగించడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. పోటీకి అవకాశం దక్కని కార్పొరేటర్లు ఒకరిపై ఒకరు కేకలు వేసుకున్నారు. ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని అసంతృప్త కార్పొరేటర్లను బుజ్జగించడంతో నామినేషన్ల ప్రక్రియకు ఆటంకం తొలగింది. కూటమి నుంచి నొల్లి నూకరత్నం (19వ వార్డు), గల్లా పోలిపల్లి (63వ వార్డు), శరగడం రాజశేఖర్ (56వ వార్డు), బొమ్మిడి రమణ (90వ వార్డు), గొలగాని వీరారావు (27వ వార్డు), పిసిని వరహానరసింహం (98వ వార్డు), పులి లక్ష్మీబాయి (75వ వార్డు), బల్ల శ్రీనివాసరావు (94వ వార్డు), పిల్ల మంగమ్మ (ఏడో వార్డు), ఇండిపెండెంట్‌గా గెలిచి ఇటీవల టీడీపీలో చేరిన విల్లూరి భాస్కరరావు (35వ వార్డు) నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ నుంచి అక్కరమాని రోహిణి (12వ వార్డు), రెయ్యి వెంకటరమణ (51వ వార్డు), మహ్మద్ ఇమ్రాన్ (66వ వార్డు), బిపిన్‌కుమార్‌జైన్ (31వ వార్డు), ముర్రువాణి (57వ వార్డు) నామినేషన్‌లు దాఖలు చేసినట్టు జీవీఎంసీ కార్యదర్శి పి.నల్లనయ్య తెలిపారు.



స్టాండింగ్ కమిటీకి నామినేషన్లు వేస్తున్న కూటమి కార్పొరేటర్లు

యారాడ సమీపాన చేపల బోటు మునక



మునిగిపోయిన బోటును లాక్కొని వస్తున్న మరో బోటు

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి చెందిన మత్స్యకారుడు అర్జల ఎర్రన్న ఐఎన్‌డి-ఏపీ-వీ-ఎంఎం-276 నంబరు బోటులో చేపల వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా యారాడ సమీపాన ఆదివారం సాయంత్రం సముద్రంలో మునిగిపోయింది. బోటు కిందనున్న చెక్కల మధ్య ఖాళీ ఏర్పడి అందులో నుంచి నీరు చేరడంతో చేపలతో సహా బోటు తలకిందులై పడిపోయింది. అందులోని వారంతా సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందడంతో మరో బోటును పంపించి, మునిగిన బోటును హార్బరుకు తీసుకువచ్చినట్టు మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ విజయ తెలిపారు. ఈ విషయాన్ని దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లగా ప్రభుత్వం నుంచి తగిన పరిహారం ఇప్పించడానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారని ఏపీ మెకనైజ్డ్ బోటు ఓనర్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు వీసీ అప్పారావు తెలిపారు.

మెడికవర్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం



- సెల్లార్‌లో బ్యాటరీల నుంచి మంటలు
- రోగులు, వారి బంధువుల్లో ఆందోళన
- సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది

- మెయిన్‌లో

విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారమే లక్ష్యం

పాఠశాలల్లో ఘనంగా శుభతిథి భోజనాలు





కంచపాలెంలో భోజనాల్లో విద్యార్థులు, ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో తల్లిదండ్రులతో కలిసి భోజనం

డాబాగార్డెన్స్, జూలై 29: విద్యార్థులకు పోషకాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రమాదేవి భానోజీరావు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం హనుమంతు ప్రభాకర్, ఎంఈఓ-1 ఎం.పైడపునాయుడు అన్నారు. స్థానిక జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో శిక్ష సప్తాహ్‌లో భాగంగా శుభతిథి భోజనం కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా పండ్లు, బిస్కెట్స్ ఉపకార చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచర్ల అచ్యుతరావు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యానికి మంచి పోషక విలువతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని కోరారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి భోజనాలు చేశారు. పండ్లు, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపకార చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి సుధీర్, గౌరీభాయి అసోసియేట్స్ అధినేత ఆర్.శివకుమార్, ఉపాధ్యాయులు కనకరాజు మాస్టర్, రాంబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: కంచరపాలెం పరిసరాల్లోని జీవిఎంసీ పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు శుభతిథి భోజనాలను పంపిణీ చేశారు. కంచరపాలెం,ఊర్వీపేట, కప్పరాడ, సుభాష్‌నగర్, ఆశవానిపాలెం, కెమత్రిపాలెం, తిక్కవానిపాలెం, ధర్మానగర్ తదితర పాఠశాల్లో విద్యార్థులకు ప్రత్యేక వంటకాలతో భోజనాలను అందించారు. పులిహోర అరటిపండు, స్వీటు, బిర్యాని తదితర రకాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు, స్థానిక పెద్దలు పాల్గొని వారి చేతుల మీదుగా చిన్నారులకు భోజనాలను వడ్డించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ శ్రీభరత్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న సనపల వరప్రసాద్

మురళీనగర్, జూలై 29 ; విశాఖ ఎంపీ శ్రీభరత్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం మురళీనగర్ టీడీపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిపారు. 50 వవార్డు అధ్యక్షులు సనపల.వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకల్లో ప్రముఖ న్యాయవాది నరసింహ, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేశారు. శ్రీ భరత్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన పార్టీ వారసత్వాన్ని కొనసాగిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

అక్కయ్యపాలెం: శ్రీ భరత్ జన్మదినం సందర్భంగా 49వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహనరావు ఆధ్వర్యంలో ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఈ కార్యక్రమాన్ని హాజరై ప్రారంభించారు. చిన్నభరత్, రాజగిరి కన్నబాబు, బొడ్డేటి కన్నారావు తదితరులు పాల్గొన్నారు. చిన్నూరులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ ముక్కా శ్రావణి, వార్డు టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ హాజరై కేక్ కట్ చేశారు. నాయకులు పెద్ద లక్ష్మణ్, శ్రీనివాస్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్: పూర్ణామార్కెట్‌లో శ్రీవరసిద్ధి వినాయక వర్తక సంఘం ఆధ్వర్యంలో ఎంపీ శ్రీభరత్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్తక సంఘం కార్యదర్శి గంగాడ గోవింద్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు, నందమూరి అభిమానులు పండ్లు పంపిణీ చేశారు. పలువురు రక్తదానం చేశారు.

మర్రిపాలెం: మర్రిపాలెం జ్యోతి నగర్‌లోని జనరేషన్ యువ అనాథశ్రమంలో 54వ వార్డు టీ డీపీ అధ్యక్షు డు కార్తికట్టా ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్లు, ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ చేశారు. గండి బాబ్జీ తొలుత కేక్ కట్ చేసి పిల్లలకు అందజేశారు.

'సూర్య ఘర్ యోజన' పోస్టర్ ఆవిష్కరణ

మహారాణిపేట, జూలై 29: ఏపీ ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్, ఉపకలెక్టర్ టి.సీతారామమూర్తి, ఈపీడీసీఎస్ ఎస్ఈ మహేంద్రనాథ్ , డీఆర్‌వో, ఆర్డీవోలు, పోలీసు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఒలింపిక్ చీర్ ఫర్ భారత్ సెల్ఫీ పాయింట్



విజయసంకేతం చూపుతున్న ఎమ్మెల్యే గణబాబు

ఒలింపిక్స్‌లో దేశంలోని క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆకాంక్షించారు. పారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్ క్రీడల నేపథ్యంలో యువతలో ఉత్సాహం నింపేందుకు చీర్‌ఫర్ భారత్ పేరుతో జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పా యింట్ ను సోమవారం కలెక్టర్, శాసన సభ్యుడు గణబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఒలింపిక్‌లో షూటింగ్ విభాగంలో తొలి పతకం సాధిం చిన మనూబాకర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు సూచించారు.

పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా?

» జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆగ్రహం



ఇందిర స్టేడియం వద్ద చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్

పూర్ణామార్కెట్, జూలై 29: జీవీఎంసీ వ రిధిలో 35వ వార్డు పాతబస్టాండ్, ఇందిరా స్టేడియం పరిసర ప్రాంతాల్లో రోడ్లు, కాలువల వద్ద చెత్త పేరుకుపోవ డంపై నగర కమిషనర్ సంపత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం 6 గంటల న మయం లో స్టేడియం రోడ్డు, అక్కడి చేపలబజారు పరిసరాలను తనిఖీ చేపట్టారు. రామకృష్ణా బజారుతోపాటు స్టేడియం రోడ్డులో చెత్తచెదారాలు ఉండడం గుర్తించారు. కా లువల గట్టు విరిగి అధ్వానంగా స్థితి చేరడంపై ప్రజారోగ్య విభాగం అధి కారులు ప్రశ్నించారు. పరిసరాల పరిశుభ్రతపై అలస త్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు వార్డులోని సమస్యలను కమిషనర్ దృష్టి తెచ్చారు. ఆయన వెంట వార్డు టీడీపీ నాయకులు, అధికారులు ఉన్నారు.

పోర్టు ఆస్పత్రిని పీపీపీ ప్రాతిపదికన ఇవ్వొద్దు



పోర్టు ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 29: విశాఖ పోర్టు ఆసుపత్రిని పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) పద్ధతిలో నిర్వహించాలనే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ నాయయకుడు పీఎస్ పద్మనాభరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగు లైన్ల రహదారికి అనుకుని ఉన్న పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విశాఖ పోర్టు ఆస్పత్రిని రూ.222.43 కోట్లతో పీపీపీ పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖా మంత్రి సర్బానంద సోనావాల్ లోక్‌సభలో ప్రతిపాదన చేశారన్నారు. ఈ ప్రయత్నాన్ని విరమించి పోర్టు సొంత నిదులతో ఆసుపత్రి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 80 పడకలతో నడుస్తున్న పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి ద్వారా ఎంతో మంది పోర్టు ఉద్యోగులు వైద్యం పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. జగన్, బి. లక్ష్మణరావు, కె. సత్యనారాయణ, నరసింగరావు, జె.సత్యనారాయణ, ఈశ్వరరావు, లక్ష్మణ్, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

'ఫార్మసీ' ఉద్యోగులకు సర్టిఫికెట్లు తక్షణం ఇవ్వాలి

» కార్మిక శాఖ అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్



కలెక్టరేట్ ఎదుట సెంట్రల్ ఫార్మసీ ఉద్యోగులు

మహారాణిపేట, జూలై 29: సెంట్రల్ ఫార్మసీ బాధితులకు తక్షణమే సర్టిఫికెట్లు ఇవ్వాలని లేకుండా, లేకుంటే ఫార్మసీని సీజ్ చే యాలని కార్మిక శాఖ ఉప కమిషనర్‌ను కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. సెంట్రల్ ఫార్మసీలో పనిచేస్తున్న ఉద్యోగుల వద్ద సర్టిఫికెట్లు తీసుకుని తిరిగి కావాలన్న వారికి పనిచేసిన కాలంలో తీసుకున్న జీతం, భోజనం ఖర్చు చెల్లించాలన్న వేధిస్తున్న ఆ యాజమాన్యంపై బాధితులు కొద్దిరోజుల కిందట కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ వారికి త్వరలోనే సర్టిఫికెట్లు అందించేలా చూస్తానని భరోసా ఇచ్చారు. ఈ క్రమంలో సోమవారం డీసీపీ తహీన్ సిన్హా ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు ఇస్తామని, కార్యాలయానికి రావాలని 74 మంది బాధితులకు సమాచారమిచ్చారు. ఇలా వచ్చినబాధితులకు డీసీపీ సమక్షంలో యాజమాన్యం మెలిక పెట్టింది. దీంతో బాధితులు కలెక్టర్ వద్దకు వచ్చి జరిగిన విషయం వివరించారు. కలెక్టర్ కార్మిక శాఖ ఉప కమిషనర్‌కు ఫోన్ చేసి సెంట్రల్ ఫార్మసీలో అవకతవకలున్నాయని, తక్షణమే బాధితులకుయాజమాన్యం నుంచి సర్టిఫికెట్లు అందజేయాలని ఆదేశించారు.లేకుంటే వెంటనే షాపును సీజ్ చేయాలని ఆదేశించారు. దీనిపై పూర్తి విచారణకు ఆదేశించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం: జడ్సీ

జ్ఞానాపురం, జూలై 29: ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించాలని జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జీవి కృష్ణ అన్నారు. సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో నిర్వహించిన పరిష్కార వేదికలో 4 అర్జీలను స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి 3, పబ్లిక్ హెల్త్‌కు 1 చొప్పున వచ్చాయి. సూపరెండెంట్ టి.ఎస్ఎన్.రాజు, ఈఈలు మృత్యుంజరాజు, తారా ప్రసన్న, ఏసీపీ వెంకటరావు, వైద్యాధికారి సునీల్ కుమార్, ఆర్ఓలు బాబురావు, రాజ్యలక్ష్మి, ఏపీడీలు చిరంజీవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి



ఎమ్మెల్యేకు వినతినిస్తున్న కార్పొరేటర్ గోవింద్

సీతంపేట, జూలై 29: గ్రేటర్ 25వ వార్డు సీతంపేటలో పలు సమస్యలను పరిష్కారించాలని కోరుతూ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుని కోరారు. ఈమేరకు వినతి పత్రమిచ్చారు. వార్డులో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బీజేపీ తరఫున శాసనసభ పక్ష నేతగా ఎన్నికైన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూ రా ష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వీర్రాజు, విశాఖ పార్లమెంట్ ముస్లిం మైనారిటీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

'జీవీఎంసీ పాఠశాలలో ఆక్రమణలు నిరోధించాలి'

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 42వార్డు పరిధి రైల్వేన్యూకాలనీలోని జీవీఎంసీ పాఠశాల ఆవరణలో కొందరు చేపడుతున్న ఆక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ, వార్డుకి చెందిన గోపాలరెడ్డి జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదుచేశారు. పాఠశాల ఆవరణలో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు వాకింగ్‌ట్రాక్ పేరుతో అక్కడికి వాకింగ్‌కు వెళ్లేవారి నుంచి డబ్బులు వసూలుచేస్తున్నారన్నారు. క్రీడల్లో శిక్షణ పేరుతో విద్యార్థుల నుంచి నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. పాఠశాల ముగిసిన తర్వాత గేటు తాళాలను తమ అధీనంలో ఉంచుకుని అసోషియేషన్ పేరుతో దందా చేస్తున్నారని పేర్కొన్నారు.

అమరవీరుల దినోత్సవం ర్యాలీ



రైల్వేన్యూకాలనీలోర్యాలీ చేస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 29 : భారతదేశ కార్గిల్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని కేఏఎంఎం ఉన్నత పాఠశాల వద్ద కూటమి పార్టీల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి ముష్కి రామకృష్ణ, బీజేపీ, జనసేన అధ్యక్షులు గురుగోవింద్ సింగ్, నాగమణి, నాయకులు ముప్పల శ్రీకృష్ణ, దువ్వి కాశీప్రసాద్, తోట శ్రీదేవి, కుంతీ, సీత తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా దేవుని రాజ్య సువార్త నెరవేరుస్తాం



ప్రసంగిస్తున్న పాల్‌విక్టర్, పాస్టర్లు

డాబాగార్డెన్స్, జూలై 29: ఒకరికొకరు తోడుగా ఉండడం ద్వారా దేవుని రాజ్య సువార్త కార్యక్రమాలను నెరవేరుస్తారని డా.గరికముక్కుల పాల్‌విక్టర్ అన్నారు. సోమవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో విశాఖ జిల్లా క్రైస్తవ నాయకుల సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో దేవుని రాజ్య విస్తరణలో భాగంగా నిర్వహించనున్న సమావేశాలు, సేవకుల నడస్సు ఐక్య కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు డా.నల్ల శ్యామూల్, డా.ఎస్. డేవిడ్‌రాజ్, బిషప్ జార్జిబాబు, ఎం.అబ్రహాం, బిషప్, జాన్, భాస్కర్‌రాజు, కె. పద్మకుమార్, వై. పాల్‌బజిక్, అనల్‌చోప్రా, అభిషేక్‌రాజ్, ప్రభాకర్, జాన్‌విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చెస్ టోర్నీకి ఎంపిక



ఎంపికైన అఫీషస్ మహ్మద్

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 29: జాతీయ అండర్- 11 బాలికల చెస్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన చిన్నారి అఫీ షస్ మహ్మద్ ఎంపికైంది. భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అఫిషస్ మహ్మద్‌ఆటలో అద్భుతంగా ఎత్తులు వేసి ద్వితీయ స్థానం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించింది. త్వరలో తెలంగాణలో జరిగే జాతీయ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ బాబురావు, మణికంఠరావుతోపాటు ఇతర ప్రతినిధు లు శ్రీకాంత్, ఉమామహేశ్వరరావు తదితరులు చిన్నారి అఫీషస్‌ను, అభినందించారు.

అర్బన్ తహసీల్దార్‌గా రమేష్



బాధ్యతలు స్వీకరించిన రమేష్

సీతమ్మధార, జూలై 29: నగర పరిధి అర్బన్ తహసీల్దార్‌గా ఎం.రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ముందు వెలగపూడి సచివాలయంలో సెక్షన్ అధికారిగా విధులు నిర్వహించారు. గతంలో మధురవాడలో ఆర్‌ఐగా పనిచేశారు. సోమవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు పాటించి దరఖాస్తులు చేసుకున్నవారికి త్వరితగతిన ధ్రువపత్రాలు జారీ చేస్తానన్నారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

కంచరపాలెం, జూలై 29 : చోరీ కేసులో నిందితుడు బాలాజీ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు కంచరపాలెం క్రైం సీఐ శ్రీనివాసరావు తెలిపారు. జ్ఞానాపురం సోఫియా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గదిలో ఈనెల 8న రాత్రి చోరీ జరిగింది. బీరువాలోని రూ.5.50 లక్షలు పోయినట్టు ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు ఇచ్చారు. ఈమేరకు దర్యాప్తు చేపట్టి కేసులో నిందితుడు కుడిపూడి బాలాజీను సోమవారం సుజాత నగర్ వద్ద అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రెండు బైక్‌లు, ఐ ఫోన్, ఫ్రిడ్జ్‌తో పాటు రూ. 50 వేలు స్వాధీనం చేసుకున్నారు. వ్యసనాలకుఅలవాటు పడి బాలాజీ రాత్రి పూట చోరీలకు పాల్పడుతున్నట్టు సీఐ తెలిపారు

'సెవెన్ హిల్స్ అస్పత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

అక్కయ్యపాలెం, జూలై 29: సెవెన్ హిల్స్ అస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు వై.రాజు కార్మికశాఖాధికారిని కోరారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ సెవెన్ హిల్స్ అస్పత్రి కొత్త యాజమాన్యం కార్మికులను కొత్త పద్ధతిలో ఇబ్బందులు పెడుతుందన్నారు. ఒక్కరితోనే అనేక పనులు చేయించి భారంపెంచాలని చూస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెవెన్ హిల్స్ కార్మికుల నాయకులు సూకరాజు, నాయుడు, రమణ, పుష్ప, ఫెలోమీనా తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధానికి అంతర్గత కమిటీలు: కలెక్టర్

మహారాణిపేట, జూలై 29: జిల్లా వ్యాప్తంగా మహిళలు పని చేసేచోట లైంగిక వేధింపుల నిరోధానికి అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. పని ప్రదేశంలో మహిళలకు లైంగిక వేధింపులు చటం 2013కు సంబంధించి ఐసీడీఎస్ అధ్వర్యంలో పోస్టర్, హ్యాండ్ బుక్‌ను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై ఈ చట్టం వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప కలెక్టర్ సీతా రామమూర్తి, మహిళా సంక్షేమ శాఖ అధికారి జయాదేవి, డీఆర్‌వో, ఆర్డీవోలు, జీవీఎంసీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్, జీవీఎంసీ దృష్టికి సమస్యలు

మహారాణిపేట, జూలై 29: జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కలెక్టర్ ఎం ఎన్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించాలని కోరారు.

కమిషనర్‌ను కలిసిన సచివాలయ కార్యదర్శులు



జీవీఎంసీ కమిషనర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న సచివాలయ కార్యదర్శులు

జ్ఞానాపురం, జూలై 29: జీవీఎంసీ నూతన కమిషనర్ సంపత్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ సచివాలయం ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మరియోవర ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యదర్శులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాళిదాస్, ఆర్.కృష్ణ, జి. రామచంద్రరావు, శ్యామ్, రాణీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు స్పీకర్ అయ్యన్న మార్గదర్శకులు



స్పీకర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న నజీర్

మహారాణిపేట, జూలై 29: స్పీకర్ గా చింతకాయల అయ్యన్న పాత్రుడు అనుభవం కొత్తగా ఎన్నికైన శాసన సభ్యులకు మార్గ దర్శకంగా నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. సోమవారం ప్రభుత్వసర్క్యూట్ హౌస్‌లో అయ్యన్న పాత్రుడును మర్యాదపూర్వకంగా అయన కలుసుకున్నారు. బీసీ సెల్ నాయకుడు బొట్టా పరదేశి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ విజేత విశాఖ

» ఫైనల్స్‌లో కృష్ణాపై 433 పరుగుల భారీ తేడాతో గెలుపు



ట్రోఫీతో విజేత జట్టు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 29: ఏసీఏ రాష్ట్ర స్థాయి అం డర్-16 బాలుర మల్టీ డే క్రికెట్ టోర్నీలో విశాఖ చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్స్‌లో కృష్ణాపై 433 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. నెల్లూరు జరిగిన ఈ టోర్నీ ఫైనల్స్ తొలి ఇన్నింగ్స్‌లో విశాఖ ఏడు వికెట్లకు 456 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. వీసీహెచ్. శ్రావన్ (113), రేహన్ గణపతి (151 నాటౌట్) సెంచరీలు సాధించగా, ఈశ్వర్ వర్ధన్ (87) అర్ధ సెంచరీ చేశాడు. సోమవారం తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన కృష్ణా 69.4 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌటైంది. విశాఖ బౌలర్ కె.భాను శ్రీహర్ష ఆరు వికెట్లు పడగొట్టి కృష్ణా బ్యాటర్లను పెవిలియన్ దారి పట్టించాడు. కే గౌతమ్ ఆర్య రెండు వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన విశాఖ 40 ఓవర్లలో నాలుగు వికెట్లకు 194 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. 502 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన కృష్ణ 19.1 ఓవర్లలో కేవలం 69 పరుగులకు కుప్పకూలి ఓటమి చెందింది. విశాఖ బౌలర్లలో గౌతమ్ ఆర్య నాలుగు, భాను స్వరూప్ రెండు వికెట్లు తీశారు.

విద్యా సంబంధిత కార్యక్రమాలపై సమీక్ష

కంచరపాలెం, జూలై 29 : ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాసంబంధిత కార్యక్రమాలపై ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు సకాలంలో తగిన సమాచారాన్ని అందించాలని ఎంఈవోలు అంబడి సోమేశ్వర్రావు, డి.దివాకర్ కోరారు. కంచరపాలెం నుంచి ఎన్ఏడీ జంక్షన్ వరకు గల ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్‌తో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలను వివరించి అవగాహన కల్పించాలన్నారు. యూ డైస్ ప్లస్‌లో ప్రతి విద్యార్థి వివరాలు నమోదు చేయాలని కోరారు.విద్యాహక్కు చట్టం ద్వారా విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాలను కల్పించాలని, రోజూ సకాలంలో విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కంచరపాలెం,జూలై 29 : స్థానిక ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో సోమవారం ఆడికృత్తిక మహోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దేవాల కృష్ణ స్వామి ఆధ్వర్యంలో వివిధ దోషాల నివారణకు చేపట్టిన విశిష్ట అర్చనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

2 నుంచి మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, జూలై 29: విజయవాడ డివిజన్‌లో నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లు మళ్లింపు మార్గంలో నడుస్తాయని సీనియర్ డీసీఎం కె సందీప్ తెలిపారు.

దారి మళ్లించిన రైళ్లు...

ఆగస్టు 2 నుంచి 10 వరకువిశాఖ- న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), న్యూఢిల్లీ-విశాఖఏపీ ఎక్స్‌ప్రెస్ (20806),భువనేశ్వర్-ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), ముంబాయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019); ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్ ప్రెస్ (12727), హైదరాబాద్-విశాఖ గోదావరిఎక్స్‌ప్రెస్ (12728); ఆగస్టు 4న యశ్వంత్‌పూర్-టాటా ఎక్స్‌ప్రెస్ (18112), ఆగస్టు 8న టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111) రైళ్లు వయా రాయనపాడు, గుడివాడ, నిడదవోలు మీదుగా నడుస్తాయి. ఈ రైళ్లు విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లకు చేరవు. అయితే, రామవరప్పాడు స్టేషన్ వద్ద తాత్కాలిక హాల్ట్ కల్పించారు. ఇక, ఆగస్టు 2 నుంచి 10 వరకు విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18520) రైళ్లు వయా రామవరప్పాడు, రాయనపాడు మీదుగా నడుస్తాయి. విజయవాడ స్టేషన్‌ను తొలగించి, రామవరప్పాడు స్టేషన్ వద్ద తాత్కాలిక హాల్ట్ కల్పించారు.

కాగా ఆగస్టు 2 నుంచి 10 వరకు విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739), సికింద్రాబాద్-విశాఖగరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12740), షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045); ఆగస్టు 3 నుంచి 11 వరకు హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎ క్స్‌ప్రెస్ (18046); ఆగస్టు 4 నుంచి 7 వరకు నిజాముద్దీన్ -విశాఖ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12804), ఆగ స్టు 5 నుంచి 9 వరకు విశాఖ-నిజాముద్దీన్ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12803); ఆగస్టు 4న గాంధీధాం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (20804), ఆగస్టు 8న విశాఖ-గాంధీధాం ఎక్స్‌ప్రెస్ (20803), ఆగస్టు 5న పూరి-వోకా ఎక్స్‌ప్రెస్ (20819), ఆగస్టు 7న వోకా-పూరి ఎక్స్‌ప్రెస్ (20820), ఆగస్టు 8న విశాఖ-సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503) రైళ్లు వయా రాయనపాడు, గుణదల మీదుగా నడుస్తాయి. విజయవాడ స్టేషన్‌ను తొలగించి రాయనపాడు స్టేషన్ వద్ద తాత్కాలిక హాల్ట్ కల్పించారు.

సీఐల కలెక్షన్!?

... 5వ పేజీ తరువాయి

కానిస్టేబుల్ దాలినాయుడు వసూళ్లకు పాల్పడుతున్నారంటూ సీపీ శంఖబ్రత బాగ్చి ఏఆర్‌కు అటాచ్‌మెంట్ చేశారు. అలాగే పోర్ట్ టౌన్ కానిస్టేబుల్ పి.హరీష్‌కుమార్‌ను రెండు రోజుల కిందటే సస్పెండ్ చేశారు. ఈ ఉదంతాల్లో స్టేషన్‌లోని అధికారుల పాత్ర ఉన్నప్పటికీ, అందుకు ఆధారాల్లేకపోవడంతో చర్యల నుంచి తప్పించుకోగలిగారని అధికారులే చెబుతున్నారు. ఈ వ్యవహారంపై సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టిసారిస్తే స్టేషన్‌లలో వసూళ్ల వెనుక 'పెద్ద తలకాయలు' ఎవరనేది అర్థమవుతుంది.

పెద్దాస్పత్రికి సిబ్బంది కొరత

... 5వ పేజీ తరువాయి

తరలించడం, పరీక్షలకు తీసుకువెళ్లడం, విభాగాలకు మార్చడం వంటి సేవలు అందించడంలో కీలకంగా వ్యవహరించే ఎంఎన్‌వో (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ), ఎఫ్ఎన్‌వో (ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్లీ)ల కొరత తీవ్రంగా ఉంది. వీరినే వార్డు బాయ్/ఉమెన్‌లుగా పేర్కొంటారు. కేజీహెచ్‌కు 231 వార్డు బాయ్ పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 169 మంది ఉన్నారు. 62 ఖాళీలు ఉన్నాయి. అలాగే, ఎఫ్ఎన్‌వోలు 150 మంది ఉన్నారు. వీరిలో పలు రకాల కారణాలతో 20 మంది వరకూ నిత్యం సెలవుల్లో ఉంటున్నారు. ఈ రెండు కేటగిరీలతోపాటు ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీచేయాలని, మరికొన్ని అదనంగా మంజూరు చేయాలని లేదంటే వైద్య సేవలపై ప్రభావం పడుతుందంటున్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించామని ఆస్పత్రి సూపరింటెండెంట్ శివానంద తెలిపారు.

ఈపీడీసీఎల్‌లో ఇంటిదొంగలు

... 5వ పేజీ తరువాయి

ఏజెన్సీలో పాడేరుకు బదిలీ చేశారు. ఆ ఉన్నతాధికారిని మాత్రం నగరంలోనే జోన్-3 నుంచి మరో జోన్‌కి మార్చారు.

వ్యక్తిగత అవసరాల కోసమా...మాయం చేయాలనా?

ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాలకు జమ చేయాల్సిన మొత్తాలను అటెండర్ ఖాతాకు మళ్లించడం వెనుక ఉద్దేశం, కొద్దిరోజులు ఆగితే వాటిని ఉద్యోగులు మరిచిపోతారని, అప్పుడు వాటిని కాజేయాలని ప్లాన్ చేశారని ఒక వర్గం చెబుతోంది. అలా కాకుండా వ్యక్తిగత అవసరాల కోసం ఆ నిధులను వాడుకొని మళ్లీ అవి సర్దుబాటు అయ్యాక జమ చేసే ఉద్దేశంతో కూడా చేసి ఉండవచ్చునని అంటున్నారు. ఇంతకీ ఎందుకు చేశారనేది బయటపడలేదు. ఇప్పుడు ఆ అటెండర్‌ను సర్వీసు నుంచి తొలగించాలని అధికారులు ఉత్తర్వులు తయారుచేస్తున్నారు. అసలు ఈ నిధులు వ్యక్తిగత ఖాతాకు మళ్లడానికి కారణమైన అధికారిపై మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. అమరావతిలో జాయింట్ సెక్రటరీ స్థాయిలో ఒక అధికారి ఒత్తిడి తెచ్చి అడ్డం పడుతున్నారని ప్రచారం జరుగుతోంది. ఇప్పటికైనా ఈపీడీసీఎల్ అధికారులు నిందితులపై చర్య చేపడతారా? లేదా? అని వేచి చూడాలి.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

అవగాహనతోనే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట

స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు

ఉక్కుటౌన్‌షిప్, జూలై 29: ట్రాఫిక్ నిబంధనలపై అందరికీ అవగాహన ఉండడంతో పాటు వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉంటే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ డీపాల్ స్కూల్‌లో సోమవారం ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్సుల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ పిల్లలను తీసుకువచ్చే ఆటోలు, బస్సుల డ్రైవర్లు చాలా జాగ్రత్తగా వాహనాలను నడపాలన్నారు. ఏ మాత్రం తొందరపాటుకు గురవ్వకుండా చాలా నిదానంగా, రహదారి నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని ఆయన సూచించారు. పరిమితికి మించి విద్యార్థులను తమ వాహనాల్లో ఎక్కించరాదని సీఐ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ మహాలక్ష్మి, స్కూల్ ప్రిన్సిపాల్ అనిష్ మాథ్యూ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు జీఎం (హెచ్ఆర్)కు సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 29: స్టీల్‌ప్లాంటులో 34 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో విధులు నిర్వహించి పదవీ విరమణ చేయనున్న జీఎం (హెచ్ఆర్) కె.సంజీవరావును సోమవారం గుర్తింపు యూనియన్ నాయకులు ప్లాంట్‌లో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. జీఎం (హెచ్ఆర్)గా ఆయన చేసిన సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జి.బోసుబాబు, మసేన్‌రావు, కె.రాజుబాబు, దేముడు, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ

మల్కాపురం, జూలై 29: కొత్త నక్కవానిపాలెం ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లంబోదర అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా భారీ గణనాథుని విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే గణబాబు ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. సెప్టెంబరు ఏడు నుంచి 28వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహిస్తారు. కార్యక్రమంలో నిర్వాహకుడు మొల్లి శ్రీను, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, కూటమి పార్టీల ఏడు వార్డుల ఇన్‌చార్జి విశ్వనాధుల దినకర్, టీడీపీ నాయకుడు రామ్మోహన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'సకాలంలో జీతాలు చెల్లించాలి'

ఉక్కుటౌన్‌షిప్, జూలై 29: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఉక్కు ఉద్యోగులందరికీ ఒకటో తేదీన జీతాలు చెల్లించేవారని, కానీ ఆరు నెలలుగా సకాలంలో చెల్లించడం లేదని, విడతల వారీగా కొంత జీతాలివ్వడం భావ్యం కాదన్నారు. దీంతో చాలామంది ఉద్యోగులు బ్యాంకుల్లో డీఫాల్టర్లుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో జీతాలు చెల్లించాలన్న డిమాండ్‌తో మంగళవారం ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నామని, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనవలసిందిగా రామస్వామి కోరారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, నీలకంఠం, శ్రీనివాసరెడ్డి, వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ ట్రోఫీ ఆవిష్కరణ

పెదగంట్యాడ, జూలై 29: ఇక్కడి బీసీ రోడ్డులో గల అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆగస్టు నాలుగో తేదీ నుంచి జరగనున్న జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్-24 పోటీలకు సంబంధించిన ట్రోఫీని సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. జాతీయ స్థాయి కరాటే క్రీడాకారుడు దివంగత అమరపిని శ్రీనివాసరావు స్మారకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ 'గాజువాక' సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కరాటే పోటీల నిర్వాహకుడు నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), వినేష్ (గాజువాక)
- **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 30, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 37, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 72, బరబాటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 46, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 78, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 42, కంద 64, దేముడుచిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	82
ఫారం ధర	--	102
విత్ స్కిన్	--	174
స్కిన్‌లెస్	--	184

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి, జూలై 29: విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన పాఠ్య పుస్తకాలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎప్పుడు లేని విధంగా ఇంటర్ విద్యార్థులకు ఈ ఏడాది నుంచి పాఠ్య పుస్తకాలను సమకూర్చడం జరిగిందన్నారు. పేద విద్యార్థులకు అండగా ఉండాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. జూనియర్ కళాశాలలో పూర్తి స్థాయి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, ఎస్.సింహాచలం, వెంకటరావు, తాతారావు, సన్యాసిరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కళాశాల విద్యార్థినికి పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న పల్లా శ్రీనివాసరావు

విద్యా కానుక కిట్లు పంపిణీ..

గోపాలపట్నం: ప్రభుత్వం అందించే పథకాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు కోరారు. గోపాలపట్నం-1 ఎంపీపీ పాఠశాలలో విద్యా కానుక కిట్లను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, పథకాలను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. అనంతరం ఆయన పాఠశాలలోని సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, బొమ్మిడి రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి

ఏడు వార్డుల సమీక్ష సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

మల్కాపురం, జూలై 29: ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అధికారులకు సూచించారు. 58వ వార్డులోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో 40, 58 నుంచి 63 వార్డులకు సంబంధించిన జీవీఎంసీ, సచివాలయ, పోలీస్ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బందితో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లో నెలకొన్న సమస్యల గురించి అడిగి తెలుసుకోవడంతో పాటు వాటిని తక్షణమే పరిష్కారించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏడు వార్డులకు సంబంధించిన శ్మశానవాటికకు రూ.రెండు కోట్ల నిధులు కేటాయించినా ఇంకా అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోవడంపై అధికారులను అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆ పనులు ప్రారంభించడంతో పాటు ఇండోర్ స్టేడియం పనులను వేగవంతం చేయాలన్నారు. గెడ్డల ఆధునికీకరణకు చర్యలు చేపట్టాలని, 38జే బస్సు క్రాంతినగర్ వరకు వెళ్లేలా చూడాలని, విద్యుత్, తాగునీరు, కాలువల సమస్యలను పలువురు గణబాబు దృష్టికి తీసుకువెళ్లారు. కాగా పారిశ్రామిక ప్రాంతంలో కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరిశ్రమలు, మరోవైపు కొండలు ఉండడంతో కాలుష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 63వ వార్డు పరిధి కొండ ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని, 12 పనుల కోసం 15సార్లు టెండర్లను ఆహ్వానించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఎమ్మెల్యే అధికారులకు వివరించారు. ఈ సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గంజాయిని అరికట్టాలని ఆదేశం

జనతాకాలనీలోని విద్యుత్ సబ్ స్టేషన్ జీవీఎంసీ ఉన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న సులాభ్ కాంప్లెక్స్ ప్రాంగణం, యారాడకు వెళ్లే మార్గం, పాడైపోయిన శ్రీహరిపురం మీ-సేవా కేంద్రంలో గంజాయికి బానిసలైన వారితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు గణబాబుకు వివరించారు. అందుకు ఆయన స్పందించి హార్బర్ సర్కిల్ ఏసీపీ మోసేస్ పాల్‌తో మాట్లాడి గంజాయిని పూర్తిగా అరికట్టాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ములగాడ తహసీల్దార్ తారకేశ్వరి, జెడ్సీ ఆర్‌జీవీ కృష్ణ, కార్పొరేటర్ గల్లా చిన్న, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

అలసత్వం వీడి అభివృద్ధికి కృషి చేయండి

- మండల సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు
- ఆర్అండ్‌బీ అధికారులపై ఆగ్రహం

పెందుర్తి, జూలై 29: నిధులు విడుదలకు కృషి చేస్తానని, గ్రామాల అభివృద్ధిలో మాత్రం అధికారులు అలసత్వం లేకుండా ముందుకు సాగాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీపీ మదుపాడ నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శాఖవారీగా నిధులు.. విధులపై సమీక్షించారు. అధికారులంతా జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. అభివృద్ధిలో రాజీపడే ప్రసక్తి లేదని, పనిచేయని అధికారులు ఇంటికి వెళ్లిపోవచ్చని హెచ్చరించారు. గుర్రమ్మపాలెం, జంగాలపాలెం, జెర్రిపోతులపాలెం, సరిపల్లి, రాంపురంలో వాలిమెరక, జుత్తాడలో రహదారులు, రిటైనింగ్ వాల్స్, కల్వర్టు నిర్మాణాలపై వివాదాలున్నాయంటూ, నిధులు లేవని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు మొండికేస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. నిధులు లేక పనుల్లో జాప్యం నెలకొంటుందని పీఆర్ ఏఈ సమాధానంపై పంచకర్ల అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగునీటి బోరుకునిధులు లేవనడం సరికాదన్నారు. ఇకపై, నిధులు, కాంట్రాక్టర్లను తెచ్చే బాధ్యత తనదేనన్నారు. జల్ జీవన్ మిషన్ ఇంటింటి కుళాయిలపై ఆరా తీశారు.

జెర్రిపోతులపాలెంలో రక్షిత పథకం ట్యాంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. గుర్రమ్మపాలెంలోని జగనన్నకాలనీ నీటి ముంపునుంచి విముక్తికి కల్వర్ట్ నిర్మాణం చేపట్టాలని సర్పంచ్ ఉగ్గిన గోవింద్ కోరారు. ఖరీఫ్‌లో రైతులకు సాగునీరు, ఎరువులు, విత్తనాలను సక్రమంగా అందించాలని ఎమ్మెల్యే కోరారు. పెందుర్తిలో గంజాయి రవాణాకు అడ్డుకట్టవేయాలన్నారు. ఈ సందర్భంగా సీఐ ఎల్ రామకృష్ణ వివరణ ఇస్తూ..పెందుర్తిలో ఇటీవల 958 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 100 మందిని అరెస్టు చేసినట్టు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించేవారికి నిఘా ఉంచామన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల మంజూరుల్లో అవకతవకలున్నట్టు పలువురు ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్ఆర్‌పురంలో క్వారీ గ్రావెల్ అక్రమ తవ్వకాలు నిలుపుచేయాలని ఎమ్మెల్యే కోరారు. వేపగుంట పినగాడి మార్గంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా పట్టించుకోవడం లేదంటూ పంచకర్ల రమేశ్‌బాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పనులపై ఆర్అండ్‌బీ ఏఈ పై అసహనం వ్యక్తం చేశారు. జీవీఎంసీ, ఆర్అండ్‌బీ అధికారులు సమన్వయంతో ఈ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు


ఆటోనగర్ బీ-బ్లాక్‌లో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం


అన్న క్యాంటీన్ సమీపంలోని కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

ఆటోనగర్‌లో పడకేసిన పారిశుధ్యం

రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం

దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ఆటోనగర్, జూలై 29: పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ పరిసరాల్లో పారిశుధ్యం కనుమరుగవుతోంది. రహదారులకు ఇరుపక్కలా చెత్తాచెదారంతో పాటు పరిశ్రమల వ్యర్థాలు ఎక్కడికక్కడ దర్శనమిస్తున్నాయి. ఆటోనగర్‌లోని పలు బ్లాకులలో చెత్త సేకరణ కోసం ఏపీఐఐసీ లక్షల రూపాయలు వెచ్చించి కుండీలను ఏర్పాటు చేసింది. అయినప్పటికీ పలు పరిశ్రమల నిర్వాహకులు పనికిరాని ప్లాస్టిక్, రబ్బరు, తదితర వ్యర్థాలను రోడ్డు పక్కల ఖాళీ ప్రదేశాలలో నిర్లక్ష్యంగా డంపింగ్ చేస్తున్నారు. మురుగు కాలువల్లో సైతం వ్యర్థాలను పడేస్తున్నారు. రోజుల తరబడి నిల్వ ఉంటున్న వ్యర్థాల నుంచి తీవ్ర దుర్గంధం వస్తుండడంతో పాటు దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు వ్యాపిస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ఆటోనగర్ పరిశ్రమల నిర్వాహకులకు పారిశుధ్యం అధ్వానంగా ఉండడం వల్ల తలెత్తే ఇబ్బందులపై ఏపీఐఐసీ, బలా సిబ్బంది అవగాహన కల్పించాలని కోరుతున్నారు.


పినమడక ఎంపీపీ పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు శుభ దిన్ భోజన్ ఏర్పాటు

అగనంపూడి, జూలై 29: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పినమడక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తహ వారోత్సవాల్లో భాగంగా సోమవారం శుభ దిన్ భోజన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు టీడీపీ నాయకుడు అండిబోయిన మంగరాజు ఆర్థిక సాయంతో వివిధ రకాల వంటకాలను తయారుచేసి వడ్డించారు. హెచ్ఎం శివాజీ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం శిక్షా సప్తహ వారోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి సేవలు అభినందనీయం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 29: నిస్వార్థానికి ప్రతిరూపం సత్యసాయి సేవా సమితి చేస్తున్న సేవలు అని స్టీల్‌ప్లాంట్ జీఎం (హెచ్ఆర్) జి.గాంధీ అన్నారు. ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం నేత్ర సంబంధిత వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని, వాహనాలు నడిపేవారు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. టౌన్‌షిప్‌లోని ట్యాక్సీ డ్రైవర్ల కోసం ఇటువంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జీఎం లలన్‌కుమార్, సమితి కన్వీనర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ

కూర్మన్నపాలెం, జూలై 29: స్టీల్‌ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,264వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 వరకు సెయిల్‌లో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని విడదీసి ఆర్ఐఎన్ఎల్‌లో కలపడం జరిగిందన్నారు. ఆ సమయంలో స్టీల్‌ప్లాంటుకు అవసరమైన అన్ని వనరులను కేటాయిస్తామని, సెయిల్‌లో అమలవుతున్న అన్ని సౌకర్యాలను ఉక్కు కార్మికులకు వర్తింపచేస్తామని అప్పటి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటి రాతలే అయ్యాయన్నారు. ముడిసరకు తగ్గడం వల్ల ఉక్కు ఉత్పత్తి తగ్గి కర్మాగారం నష్టాల బారిన పడుతుందన్నారు. కార్మికులు చిత్తశుద్ధితో వంద శాతం ఉక్కు ఉత్పత్తిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, పూర్తి సామర్థ్యంతో స్టీల్‌ప్లాంటును నడిపితే ఏటా సుమారు రూ.ఐదు కోట్ల వరకు లాభం ఆర్జిస్తుందన్నారు. అందువల్ల కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి ఉక్కు కర్మాగారాన్ని పూర్తి సామర్థ్యంతో నడిపేలా చూడాలని ఆదినారాయణ కోరారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని, లేకుంటే ప్రభుత్వ రంగంలోనైనా ఉంచాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



గాజువాక వంటిల్లు కూడలి వద్ద సిద్ధమైన అన్న క్యాంటీన్

ప్రారంభానికి సిద్ధంగా అన్న క్యాంటీన్లు

గాజువాక, జూలై 29: జీవీఎంసీ గాజువాక జోనల్ పరిధిలో ఉన్న అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఐదేళ్లుగా జీర్ణావస్థలో ఉన్న వీటికి ఇరవై రోజులుగా మరమ్మతులు చేసి, పెయింటింగ్స్ చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. గాజువాకలో వంటిల్లు జంక్షన్, ఆటోనగర్, సమ్మిదొడ్డి ప్రాంతాల్లో టీడీపీ హయాంలో గతంలో అన్న క్యాంటీన్లు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే గత వైసీపీ ప్రభుత్వం వీటిని మూసివేసింది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇచ్చిన హామీ మేరకు అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారు. ఆగస్టు 15న వీటిని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గోపాలపట్నం: స్థానిక రైతుబజారు వద్దనున్న అన్న క్యాంటీన్‌కు మరమ్మతు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గత వైసీపీ పాలనలో మూతపడిన ఈ క్యాంటీన్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఐదేళ్లుగా ఇది నిరుపయోగంగా ఉండడంతో సామగ్రి చోరీకి గురైంది. పరిసరాలు దుర్భరంగా మారాయి.

వేపగుంట: ఇక్కడి రామాలయం ఎదురుగా ఉన్న అన్న క్యాంటీన్‌కు ప్రస్తుతం ఫ్యాబ్రికేషన్ పనులు జరుగుతున్నాయి. వైరింగ్, టైల్స్ ఏర్పాటు, తదితర పనులను చేపట్టాల్సి ఉంది. ఆగస్టు మొదటి వారానికల్లా ఆయా పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టరుకు అధికారులు ఆదేశించారు.

పెదగంట్యాడ తహసీల్దారుగా రామారావు

పెదగంట్యాడ, జూలై 29: పెదగంట్యాడ మండల తహసీల్దారుగా ఎల్.రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు శ్రీకాకుళం జిల్లా రణస్థలం తహసీల్దారుగా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతకు చేపట్టిన రామారావును సచివాలయాల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల సిబ్బంది సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


బాధ్యతలు స్వీకరించిన ఎల్.రామారావు

ములగాడ తహసీల్దార్‌గా తారకేశ్వరి..



మల్కాపురం: ములగాడ మండల తహసీల్దార్‌గా తారకేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ పరంగా సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజలు దళారులను నమ్మవద్దన్నారు. అవసరమైన ధ్రువపత్రాలు ప్రజలకు సకాలంలో అందేలా చూస్తానన్నారు.

పెందుర్తి తహసీల్దార్‌గా వేణుగోపాల్..



పెందుర్తి: పెందుర్తి తహసీల్దార్‌గా వేణుగోపాల్ బాధ్యతలు చేపట్టారు. భీమిలి మండలం సంగివలసకు చెందిన ఆయన కొంతకాలం ఉపాధ్యాయునిగా పని చేశారు. ఈ క్రమంలో గ్రూప్ పరీక్ష రాసి తొలి ప్రయత్నంలోనే ఉప తహసీల్దార్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. కొంతకాలం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన ఆయనకు పదోన్నతి రావడంతో భీమునిపట్నం, పద్మనాభం, ఆనందపురం మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేశారు. ఎన్నికల సమయంలో శ్రీకాకుళం వెళ్లిన ఆయన తాజా బదిలీల్లో తహసీల్దార్‌గా ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

'గాజువాక అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా'

పెదగంట్యాడ, జూలై 29: గాజువాక నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ 75వ వార్డు నాయకులు సోమవారం దయాళ్ నగర్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. చక్కని ప్రణాళికతో గాజువాకను అభివృద్ధి చేసి మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు.

టీడీపీ హయాంలో పంపిణీ చేసిన పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయించి క్రయవిక్రయాలకు అవకాశం కల్పిస్తామన్నారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, బాజుల గంగరాజు, దువ్వి శ్రీనివాసరావు, నమ్మి సింహాద్రి, పల్లా రమణ, గ్రామ పెద్దలు బొడ్డు గోవింద, లోకేశ్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇక్కడి పెంటమాంబ అమ్మవారిని పల్లా శ్రీనివాసరావు దర్శించుకున్నారు.

ఘనంగా ఎంపీ శ్రీభరత్ జన్మదిన వేడుకలు


పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న నల్లూరు సూర్యనారాయణ, తదితరులు

కూర్మన్నపాలెం, జూలై 29: జీవీఎంసీ 86వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఎంపీ శ్రీభరత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు మాడిశ కనకరాజు, వేగుంట శ్రీనివాస్, నాగార్జున, వెంకటేశ్, తులసి, రమేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే వడ్లపూడిలోని టీడీపీ కార్యాలయంలో శ్రీభరత్ పుట్టినరోజును పురస్కరించుకుని పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచారు. కూటమి నాయకులు లక్ష్మరాజు సోంబాబు, విజయరామరాజు, రాజన్‌రాజు, పల్లె రాంబాబు, డీవీ అప్పారావు, భాగ్యలక్ష్మి, సత్తిబాబు, సాయివర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఒలింపిక్ క్రీడాకారులకు శుభాకాంక్షలు

మల్కాపురం, జూలై 29: పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్‌లో భారత తరపున పాల్గొంటున్న క్రీడాకారులందరికీ పశ్చిమ శాసన సభ్యులు గణబాబు సోమవారం శుభాకాంక్షలు తెలిపేసే కార్యక్రమాన్ని శ్రీహరిపురంలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. దేశం తరపున 16 క్రీడలలో 117 మంది క్రీడకారులు పాల్గొంటున్నారన్నారు. విశాఖపట్నం జిల్లా అథ్లెటిక్స్ విభాగంలో పాల్గొంటున్న ఎర్రాజీ జ్యోతి, ఇతర క్రీడాకారులూ దేశానికి పతకాలు తేవాలని ఆకాంక్షించారు. రాష్ట్రం నుంచి ధిరాజ్ బొమ్మదేవర, జ్యోతిక శ్రీ దండి, సాత్వికసాయిరాజ్, రాంకీరెడ్డి తదితరులు కూడా పాల్గొంటున్నారన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలని జెడ్సీకి వినతి

పెదగంట్యాడ, జూలై 29: ఇటీవల కురిసిన వర్షాలకు పారిశ్రామిక ప్రాంతంలో ఛిద్రంగా మారిన రహదారులకు మరమ్మతులు చేయించాలని కోరుతూ టీడీపీ 66వ వార్డు అధికార ప్రతినిధి నెల్లి సాధూరావు జెడ్సీ సన్యాసినాయుడుకు సోమవారం వినతపత్రం అందజేశారు. వర్షాలకు చాలా రోడ్లు గోతులమయంగా మారాయని, మరికొన్ని రాళ్లుతేలడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జెడ్సీని కలిసిన వారిలో టీడీపీ నాయకులు లక్ష్మణరావు, చంద్రరావు, నూకరాజు, తదితరులు ఉన్నారు.

69వ వార్డులో సమస్యలను పరిష్కరించాలంటూ..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డులో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి సహకరించవలసిందిగా కమిషనర్ సంపత్‌కుమార్‌కు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం గ్రేటర్ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి ముందుగా అభినందనలు తెలిపారు. అనంతరం వార్డులో ప్రధానంగా విద్యుత్ దీపాల సమస్యతో పాటు వీధి కుక్కల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కోరారు.

అమరవీరుల దినోత్సవం ర్యాలీ



వైజ్యేఎంఆర్‌బాణిరోడ్సాలో ర్యాలీ చేస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 29 : భారతదేశ కార్గిల్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా గ్రేటర్ 41వ వార్డు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి ముక్కు రామకృష్ణ, బీజేపీ, జనసేన అధ్యక్షులు గురుగోవింద్ సింగ్, నాగమణి, నాయకులు ముమ్మల లక్ష్మీకృష్ణ, దున్న జోగేశ్వరరావు, తోట శ్రీదేవి, కంటి, సీత తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా దేవుని రాజ్య సువార్త నెరవేరుస్తాం



ప్రసంగిస్తున్న పాల్‌విక్టర్, పాస్టర్లు

డాబాగార్డెన్స్, జూలై 29: ఒకరికొకరు తోడుగా ఉండడం ద్వారా దేవుని రాజ్య సువార్త కార్యక్రమాలను నెరవేర్చగలమని డా.గోకముక్కుల పాల్‌విక్టర్ అన్నారు. సోమవారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో విశాఖ జిల్లా క్రైస్తవ నాయకుల సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో దేవుని రాజ్య విస్తరణలో భాగంగా నిర్వహించనున్న సమావేశాలు, సేవలు నడప్పు ఐక్య కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు దానమ్మ శ్యామల్, డా.ఎస్ డేవిడ్‌రాజ్, బిషప్ జార్జిబాబు, ఎలిజాబెత్, బిషప్ జాన్, భాస్కర్‌రావు, కె.పద్మకుమార్, వై.పాల్‌బాబ్, అనిల్‌బోస్, అభిషేకరాజ్, ప్రభాకర్, జాన్‌విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ చెస్ టోర్నీకి ఎంపిక



ఎంపికైన అభిషేక్ మహ్మద్


విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 29: జాతీయ అండర్-11 బాలికల చెస్ ఛాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన చిన్నారి అభిషేక్ మహ్మద్ ఎంపికైంది. భీమవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి టోర్నీలో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించిన అభిషేక్ మహ్మద్‌ అద్భుతంగా రాణించి తొమ్మిదో స్థానం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించింది. త్వరలో తెలంగాణలో జరిగే జాతీయ టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా ఆల్ విశాఖ చెస్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ బాబూరావు, మజీఖురానా తోపాటు జిల్లా ప్రతినిధి లు శ్రీకాంత్, ఉమామహేశ్వరరావు తదితరులు చిన్నారి అభిషేక్‌ను అభినందించారు.

అర్బన్ తహసీల్దార్‌గా రమేష్



బాధ్యతలు స్వీకరించిన రమేష్

సీతమ్మధార, జూలై 29: నగర పరిధి అర్బన్ తహసీల్దార్‌గా ఎం.రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ముందు వెలగపూడి సచివాలయంలో సెక్షన్ అధికారిగా విధులు నిర్వహించారు. గతంలో మధురవాడలో ఆర్‌ఐ పనిచేశారు. సోమవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు పెండింగ్ దరఖాస్తులు పరిష్కరిస్తామని త్వరితగతిన ప్రమాణపత్రాలు జారీ చేస్తామన్నారు.



విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారమే లక్ష్యం

పాఠశాలల్లో ఘనంగా శుభతిథి భోజనాలు



కంచరపాలెంలో భోజనాల్లో విద్యార్థులు, ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో తల్లిదండ్రులతో కలిసి భోజనం

డాబాగార్డెన్స్, జూలై 29: విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ... ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం సూచించారు. శుభతిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వండి, వడ్డించి ... విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ... తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం: కంచరపాలెం పరిసరాల్లోని జీవీఎంసీ పాఠశాలల్లో సోమవారం విద్యార్థులకు శుభతిథి భోజనాలు వడ్డించారు. కంచరపాలెం,ఊర్వశి, కప్పరాడ, సుభాష్‌నగర్, ఆశవానిపాలెం, ... తదితర పాఠశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక వంటకాలతో భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ... ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీ శ్రీభరత్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పసల వరప్రసాద్

మురళీనగర్, జూలై 29: విశాఖ ఎంపీ శ్రీభరత్ పుట్టిన రోజు వేడుకలు సోమవారం మురళీనగర్ టీడీపీ కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిపారు. 50 వవార్డు అధ్యక్షులు పసల వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈవేడుకల్లో ప్రముఖ న్యాయవాది నరసింహ, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేశారు. శ్రీ భరత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

అక్కయ్యపాలెం: శ్రీ భరత్ జన్మదినం సందర్భంగా 41వ వార్డు టీడీపీ ఆధ్వర్యంలో ... అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ... తదితరులు పాల్గొన్నారు.

పూర్ణామార్కెట్: పూర్ణామార్కెట్‌లో శ్రీవరసిద్ధి వినాయక వర్తక సంఘం ఆధ్వర్యంలో ఎంపీ శ్రీభరత్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్తక సంఘం కార్యదర్శి గంగాధ గోవింద్ నేతృత్వంలో పార్టీ శ్రేణులు, నందమూరి అభిమానులు పండ్లు పంపిణీ చేశారు. పలువురు రక్తదానం చేశారు.

మల్కాపురం: మల్కాపురం జ్యోతి నగర్‌లో జనసేన యువ అనాథాశ్రమంలో 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కార్తికేయ ఆధ్వర్యంలో పండ్లు, స్వీట్లు, ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ చేశారు. గుండె బాల్టీ తెలుగు కేక్ కట్ చేసి పిల్లలకు అందజేశారు.

'సూర్య ఘర్ యోజన' పోస్టర్ ఆవిష్కరణ

మహారాణిపేట, జూలై 29: పీఎం సూర్యఘర్ యోజన ... కలెక్టరేట్‌లో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ... ఈపీడీసీఎల్ ఎస్‌ఈ మహేంద్రనాథ్, డీఆర్‌వో, అధికారులు, పోలీసు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ఒలింపిక్ 'ఛీర్ ఫర్ భారత్' సెల్ఫీ పాయింట్



విజయసంకేతం చూపుతున్న ఎమ్మెల్యే గణబాబు

ఒలింపిక్స్‌లో దేశంలోని క్రీడాకారులు మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆకాంక్షించారు. పారిస్ వేదికగా జరుగుతున్న ఒలింపిక్స్ క్రీడల నేపథ్యంలో యువతలో ఉత్సాహం నింపేందుకు 'ఛీర్ ఫర్ భారత్' పేరిట జిల్లా క్రీడా సాధికార సంస్థ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను సోమవారం కలెక్టర్, శాసన సభ్యుడు గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒలింపిక్‌లో మాటింగ్ విభాగంలో తొలి పతకం సాధించిన మనూబాకర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు సూచించారు.

పారిశుధ్య నిర్వహణ ఇలాగేనా?

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆగ్రహం



ఇందిరా స్టేడియం వద్ద చెత్తను పరిశీలిస్తున్న కమిషనర్

పూర్ణామార్కెట్, జూలై 29: జీవీఎంసీ 2వ జోన్‌లో 35వ వార్డు పాతబస్టాండ్, ఇందిరా స్టేడియం పరిసర ప్రాంతాల్లో రోడ్లు, కాలువల వద్ద చెత్త పేరుకుపోవడంపై నగర కమిషనర్ సంపత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి ... స్టేడియం రోడ్డు, ... పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ... పారిశుధ్య కార్మికులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ... సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఆయన వెంట వార్డు టీడీపీ నాయకులు, అధికారులు ఉన్నారు.

పోర్టు ఆస్పత్రిని పీపీపీ ప్రాతిపదికన ఇవ్వొద్దు



పోర్టు ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

అక్కయ్యపాలెం, జూలై 29: విశాఖ పోర్టు ఆసుపత్రిని పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ నాయకుడు ... పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పోర్టు ఆస్పత్రిని రూ.222.43 కోట్లతో పీపీపీ పద్ధతిలో ... పోర్టు సొంత నిధులతో ఆసుపత్రి ఆధునీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం 80 పడకలతో నడుస్తున్న పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి ద్వారా ఎంతో మంది పోర్టు ఉద్యోగులు వైద్యం పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. జగన్, బి. లక్ష్మణరావు, కె. సత్యనారాయణ, నరసింగరావు, జెసత్యనారాయణ, ఈశ్వరరావు, లక్ష్మణ్, కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

'ఫార్మసీ' ఉద్యోగులకు సర్టిఫికెట్లు తక్షణం ఇవ్వాలి

కార్మిక శాఖ అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్



కలెక్టరేట్ ఎదుట సెంట్రల్ ఫార్మసీ ఉద్యోగులు

మహారాణిపేట, జూలై 29: సెంట్రల్ ఫార్మసీ బాధితులకు తక్షణమే సర్టిఫికెట్లు ఇవ్వాలని లేబర్ ... కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సెంట్రల్ ఫార్మసీలో పనిచేస్తున్న ఉద్యోగుల వద్ద సర్టిఫికెట్లు తీసుకుని తిరిగి ఇవ్వకపోవడంతో ... ఈ నేపథ్యంలో కలెక్టర్ ... సోమవారం ... జిల్లా కలెక్టరేట్‌లో ... సెంట్రల్ ఫార్మసీలో ఉద్యోగుల సర్టిఫికెట్లు తక్షణమే ఇవ్వాలని ... ఆదేశించారు.

ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం: జడ్సీ

జ్ఞానాపురం, జూలై 29: ప్రజాసమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించాలని జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.శివ కృష్ణ అన్నారు. సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో నిర్వహించిన పరిష్కార వేదికలో 4 అర్జీలను స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి 3, పబ్లిక్ హెల్త్‌కు 1 చొప్పున వచ్చాయి. ... వైద్యాధికారి సునీల్ కుమార్, ఏఈలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఏడీఈలు విరంజన, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి



ఎమ్మెల్యేకు వినతినిస్తున్న కార్పొరేటర్ గోవింద్

సీతంపేట, జూలై 29: గ్రేటర్ 25వ వార్డు సీతంపేటలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు కోరారు. ... తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. బీజేపీ తరఫున శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన విష్ణుకుమార్ రాజును టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ ... ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వీర్రాజు, విశాఖ పార్లమెంట్ ముస్లిం మైనారిటీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

'జీవీఎంసీ పాఠశాలలో ఆక్రమణలు నిరోధించాలి'

విశాఖపట్నం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 42వార్డు పరిధి బైర్లమ్మకాలనీలోని జీవీఎంసీ పాఠశాల ఆవరణలో కొందరు చేపడుతున్న ఆక్రమణ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ, వార్డుకి చెందిన గోపాలక్రిష్ణ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఫిర్యాదుచేశారు. పాఠశాల ఆవరణలో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు వాకింగ్‌ట్రాక్ పేరుతో ఆక్రమించి వాకింగ్‌ ... విద్యార్థుల నుండి ... వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. పాఠశాల ఆవరణలో ... చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

కంచరపాలెం, జూలై 29 : చోరీ కేసులో నిందితుడు బాలాజీ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు కంచరపాలెం క్రైం సీఐ శ్రీనివాసరావు తెలిపారు. జ్ఞానాపురం సోఫియా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గదిలో ఈనెల 8న రాత్రి చోరీ జరిగింది. బీరువాలోని రూ.5.50 లక్షలు పోయినట్టు ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు ఇచ్చారు. ... నిందితుడు కుడిపూడి బాలాజీను సోమవారం సుజాత నగర్ వద్ద అరెస్టు చేశారు. ... రెండు బైక్‌లు, ఐఫోన్, ప్రింటర్‌తోపాటు రూ. 50 వేలు స్వాధీనం చేసుకున్నారు. ... రాత్రి పూట చోరీలకు పాల్పడుతున్నట్టు సీఐ తెలిపారు.

'సెవెన్ హిల్స్ ఆస్పత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

అక్కయ్యపాలెం, జూలై 29: సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు వైజాగ్ మనోహర్‌ కోరారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ... ఈ కార్యక్రమంలో సెవెన్ హిల్స్ కార్మిక నాయకులు ... పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నిరోధానికి అంతర్గత కమిటీలు: కలెక్టర్

మహారాణిపేట, జూలై 29: జిల్లా వ్యాప్తంగా మహిళలు పని చేసేచోట లైంగిక వేధింపుల నిరోధానికి అంతర్గత కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. పని ప్రదేశంలో మహిళలకు లైంగిక వేధింపుల చట్టం 2013కు సంబంధించిన ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోస్టర్, హ్యాండ్ బుక్‌ను కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. ... ఈ కార్యక్రమంలో ఉప కలెక్టర్ సీతా రామమూర్తి, మహిళా సంక్షేమ శాఖ అధికారి జయదేవి, డీఆర్‌వో, ఆర్‌డీవోలు, జీవీఎంసీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్, జీవీఎంసీ దృష్టికి సమస్యలు

మహారాణిపేట, జూలై 29: జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించాలని కోరారు.

కమిషనర్‌ను కలిసిన సచివాలయ కార్యదర్శులు



జీవీఎంసీ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సచివాలయ కార్యదర్శులు

జ్ఞానాపురం, జూలై 29: జీవీఎంసీ నూతన కమిషనర్ సంపత్ కుమారును ఆంధ్రప్రదేశ్ సచివాలయం ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మరియాదాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యదర్శులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాళిదాస్, ఆర్.కృష్ణ, జి.రామచంద్రరావు, శ్యామ్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు స్పీకర్ అయ్యన్న మార్గదర్శకులు



స్పీకర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న నజీర్

మహారాణిపేట, జూలై 29: స్పీకర్‌గా చింతకాయల అయ్యన్న పాత్రుడు అనుభవం కొత్తగా ఎన్నికైన శాసన సభ్యులకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ అన్నారు. సోమవారం ప్రభుత్వ అతిథి గృహంలో అయ్యన్న పాత్రుడును మర్యాదపూర్వకంగా ఆయన కలుసుకున్నారు. బీసీ సెల్ నాయకుడు బొట్టా పరదేశి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ విజేత విశాఖ

ఫైనల్స్‌లో కృష్ణాపై 433 పరుగుల భారీ తేడాతో గెలుపు



ట్రోఫీతో విజేత జట్టు

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 29: ఏసీఏ రాష్ట్ర స్థాయి అండర్-16 బాలుర మల్టీ డే క్రికెట్ టోర్నీలో విశాఖ ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో కృష్ణాపై 433 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. నెల్లూరు జరిగిన ఈ టోర్నీ ఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో విశాఖ ఏడు వికెట్లకు 456 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. వీఆర్‌పీ. శ్రావన్ (113), రోహన్ గుబాని (151 నాటౌట్) సెంచరీలు సాధించగా, ఈశ్వర్ వర్ధన్ (87) అర్ధ సెంచరీ చేశారు. సోమవారం తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన కృష్ణా 69.4 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌటైంది. విశాఖ బౌలర్ కె.బాను శ్రీహర్ష ఆరు వికెట్లు పడగొట్టి కృష్ణా బ్యాటర్లను పెవిలియన్ దారి పట్టించాడు. కె గౌతమ్ అర్ధ రెండు వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కు దిగిన విశాఖ 40 ఓవర్లలో నాలుగు వికెట్లకు 194 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. 502 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేసిన కృష్ణ 19.1 ఓవర్లలో కేవలం 69 పరుగులకు కుప్పకూలి ఓటమి చెందింది. విశాఖ బౌలర్లలో గౌతమ్ ఆర్య నాలుగు, బాను స్వరూప్ రెండు వికెట్లు తీశారు.

విద్యా సంబంధిత కార్యక్రమాలపై సమీక్ష

కంచరపాలెం, జూలై 29 : ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాసంబంధిత కార్యక్రమాలపై ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు సహకారం అందించాలని ఎంఈవోలు అంబటి సోమేశ్వరావు, డి.దివాకర్ కోరారు. కంచరపాలెం నుంచి ఎన్‌ఏడీ జంక్షన్ వరకు గల ప్రైవేట్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్‌తో సోమవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు వివరించి అవగాహన కల్పించాలన్నారు. యూ డైస్ ప్లస్‌లో ప్రతి విద్యార్థి వివరాలు నమోదు చేయాలని కోరారు.విద్యాహక్కు చట్టం ద్వారా విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించాలని, లేఖా సహాలలో విద్యార్థుల ఆన్‌లైన్ హాజరు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కంచరపాలెం,జూలై 29 : స్థానిక ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో సోమవారం ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారికి పూజలు, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త దేవరకృష్ణ స్వామి ఆధ్వర్యంలో వివిధ దోషాల నివారణకు చేపట్టిన విశిష్ట అర్చనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

2 నుంచి మళ్లింపు మార్గంలో పలు రైళ్లు

విశాఖపట్నం, జూలై 29: విజయవాడ డివిజన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లు మళ్లింపు మార్గంలో నడుస్తాయని సీనియర్ డీసీఎం కె సందీప్ తెలిపారు.

దారి మళ్లించిన రైళ్లు...

ఆగస్టు 2 నుంచి 10 వరకువిశాఖ- న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805), న్యూఢిల్లీ-విశాఖపట్నం ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806),భువనేశ్వర్-ముంబయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), ముంబయి-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019); ఆగస్టు 3 నుంచి 11వ తేదీ వరకు విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), హైదరాబాద్-విశాఖ గోదావరిఎక్స్‌ప్రెస్ (12728); ఆగస్టు 4న యశ్వంత్‌పూర్-టాటా ఎక్స్‌ప్రెస్ (18112), ఆగస్టు 8న టాటా-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (18111) రైళ్లు వయా రాయనపాడు, గుడివాడ, నిడదవోలు మీదుగా నడుస్తాయి. ఈ రైళ్లు విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం స్టేషన్లకు వెళ్లవు. అయితే, రామవరప్పాడు స్టేషన్ వద్ద తాత్కాలిక హాల్ట్ కల్పించారు. ఇక, ఆగస్టు 2 నుంచి 10 వరకు విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18520) రైళ్లు వయా రామవరప్పాడు, రాయనపాడు మీదుగా నడుస్తాయి. విజయవాడ స్టేషన్‌కు తొలగించి, రామవరప్పాడు స్టేషన్‌ వద్ద తాత్కాలిక హాల్ట్ కల్పించారు.

కాగా ఆగస్టు 2 నుంచి 10 వరకు విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739), సికింద్రాబాద్-విశాఖగరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12740), షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18045); ఆగస్టు 3 నుంచి 11 వరకు హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ (18046); ఆగస్టు 4 నుంచి 7 వరకు నిజాముద్దీన్-విశాఖ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12804), ఆగస్టు 5 నుంచి 9 వరకు విశాఖ-నిజాముద్దీన్ స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ (12803); ఆగస్టు 4న గాంధీధామ్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (20804), ఆగస్టు 8న విశాఖ-గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్ (20803), ఆగస్టు 5న పూరీ-ఓఖా ఎక్స్‌ప్రెస్ (20819), ఆగస్టు 7న ఓఖా-పూరి ఎక్స్‌ప్రెస్ (20820), ఆగస్టు 8న విశాఖ-సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503) రైళ్లు వయా రాయనపాడు, గుణదల మీదుగా నడుస్తాయి. విజయవాడ స్టేషన్‌కు తొలగించి రాయనపాడు స్టేషన్ వద్ద తాత్కాలిక హాల్ట్ కల్పించారు.

సీఐల కలెక్షన్!?

... 5వ పేజీ తరువాయి

కానిస్టేబుల్ దాలినాయుడు వసూళ్లకు పాల్పడుతున్నారంటూ సీపీ శంఖబ్రత బాగ్చి ఏఆర్‌కు అటాచ్‌మెంట్ చేశారు. అలాగే పోర్ట్ టౌన్ కానిస్టేబుల్ పిఆర్‌కుమార్‌ను రెండు రోజుల కిందటే సస్పెండ్ చేశారు. ఈ ఉదంతాల్లో స్టేషన్‌లో అధికారుల పాత్ర ఉన్నప్పటికీ, ... ఈ వ్యవహారాన్ని సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టిసారిస్తే స్టేషన్లలో వసూళ్ల వెనుక 'పెద్ద తలకాయలు' ఎవరనేది అర్థమవుతుంది.

పెద్దాస్పత్రికి సిబ్బంది కొరత

... 5వ పేజీ తరువాయి

తరలించడం, పరీక్షలకు తీసుకువెళ్లడం, విభాగాలకు మార్చడం వంటి సేవలు అందించడంలో కీలకంగా వ్యవహరించే ఎంఎన్‌వో (మేల్ నర్సింగ్ ఆర్డర్లీ), ఎఫ్‌ఎన్‌వో (ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ)ల కొరత తీవ్రంగా ఉంది. వీరినే వార్డు బాయ్/ఉమెన్‌లుగా పేర్కొంటారు. కేజీహెచ్‌కు 231 వార్డు బాయ్ పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 169 మంది ఉన్నారు. 62 ఖాళీలు ఉన్నాయి. అలాగే, ఎఫ్‌ఎన్‌వోలు 150 మంది ఉన్నారు. వీరిలో పలు రకాల కారణాలతో 20 మంది నాలుగు నెలలుగా విధులకు రాకపోవడంతో ... ఈ రెండు కేటగిరీలతోపాటు ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీచేయాలని, ... రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ... ఆసుపత్రి సూపరింటెండెంట్ శివానంద తెలిపారు.

ఈపీడీసీఎల్‌లో ఇంటిదొంగలు

... 5వ పేజీ తరువాయి

ఏజెన్సీలో పాడేరుకు బదిలీ చేశారు. ఆ ఉన్నతాధికారిని మాత్రం నగరంలోనే జోన్-3 నుంచి మరో జోన్‌కి మార్చారు.

వ్యక్తిగత అవసరాల కోసమా...మాయం చేయాలనా?

ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాలకు జమ చేయాల్సిన మొత్తాలను అబెండర్ ఖాతాకు మళ్లించడం వెనుక ఉద్దేశం, కొద్దిరోజుల ఆగితే వాటిని ఉద్యోగుల మరిచిపోతారని, అప్పుడు వాటిని కాజేయాలని ... ఈ వ్యవహారంపై ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు ... విచారణ చేపడతారా? లేదా అని వేచి చూడాలి.



కమనీయం అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జూలై 29 : వరాహలక్ష్మీనృసింహస్వామి అర్జిత నిత్య కల్యాణం సోమవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు నిర్వహించారు.అంతకుముందు అర్జిత సేవగా సహస్రనామ తులసీ దళార్చన చేశారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

యశోద కృష్ణ సేవా సంఘం ఆత్మీయ సమ్మేళనం

ఎంవీపీ కాలనీ, జూలై 29 : శివాజీ పార్కులో యశోద కృష్ణ సేవా సంఘం సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసింది. అధ్యక్షుడు ముద్దాడ ఎల్లాజీరావు, ప్రధాన కార్యదర్శి బీసపు శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనంలో భవిష్యత్తులో సంఘం అభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని సభ్యులు నిర్ణయించుకున్నారు. అలాగే కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా చేయడానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సభ్యులు పిల్లల మోహన్‌రావు, ముద్దాడ శంకర్రావు, జోగ శ్రీనివాస్, ఒమ్మి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

విశాలాక్షినగర్, జూలై 29 : కైలాసగిరి తెలుగు మ్యూజియం ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ కాలనీ, పోలీస్ క్వార్టర్స్ జోడుగుళ్లపాలెం, ఎస్సీ, ఎస్టీ కాలనీ, కైలాసగిరి సర్కిల్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

పద్మనాభం తహసీల్దారుగా ఆనందకుమార్

పద్మనాభం, జూలై 29 : మండల తహసీల్దారుగా ఎం. ఆనందకుమార్ సోమవారం విధుల్లో చేరారు. ఆయన పార్వతీపురం మన్యం జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ఎన్. వెంకటరావును శ్రీకాకుళం బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో అన్ని రకాల సేవలు అందేలా చూస్తానన్నారు. కార్యాలయం ఉద్యోగులు, నాయకులు తహసీల్దారును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

పరీక్షా కేంద్రాలు పరిశీలన

వెంకోజీపాలెం, జూలై 29 : ఏయూలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షలను ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి. శశిభూషణరావు సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఎకనామిక్స్ విభాగంలో జరుగుతున్న రెండో సెమిస్టర్ పరీక్షలను పరిశీలించి, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆచార్యులకు సూచించారు.

నేడు గంటా విజయోత్సవ సభ

భీమునిపట్నం, జూలై 29 : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విజయోత్సవ సభను మంగళవారం నిర్వహించనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు దంతులూరి అప్పలనరసింహరాజు తెలిపారు. సోమవారం ఆయన బీచ్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనందపురంలోని పెద్దిపాలెం చెన్నాస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం సాయంత్రం విజయోత్సవ సభ జరుగుతుందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరుగావాలని కోరారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సరగడ అప్పారావు, యరబాల అనిల్ ప్రసాద్, పతివాడ రాంబాబు, అల్లు చిన్నయ్య పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
● **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)
● **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
● **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), నవ్యగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 30, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 42, బీరకాయలు 42, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 72, అల్లం (పాతది) 150, బరబటి 32, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 46, దోసకాయ 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 78, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు
బ్రాయిలర్

రైతు ధర	82
ఫారం ధర	102
విత్ స్కిన్	174
స్కిన్‌లెస్	184

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

భీమిలిని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

» ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
» జోనల్ కార్యాలయం పునఃప్రారంభం



కార్యాలయాన్ని పునఃప్రారంభిస్తున్న మేయరు హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, జూలై 29 : పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సోమవారం ఆయన జోన్ వన్ కార్యాలయాన్ని మేయరు గొలగాని హరివెంకటకుమారితో కలిసి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ రహదారులను తక్షణమే విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై ఒకరోజు అన్ని విభాగాల అధికారులతో కలిసి సమీక్షించడానికి అవకాశం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కూడా మాట్లాడినట్టు తెలిపారు. 2026 మే నాటికి భోగాపురం ఎయిర్ పోర్టు అందుబాటులోకి వస్తుందని, అప్పట్లోగా ఎయిర్‌పోర్టు నుంచి విశాఖ నగరానికి మధ్య ఉన్న అన్ని రహదారులు, ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం వుందన్నారు. మెట్రో రైలు కూడా ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు. నియోజకవర్గంలో వున్న అన్ని పార్టీల కార్పొరేటర్లు,నాయకులు మన ప్రాంతం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సహకరించాలని కోరారు. లోకల్ మేనిఫెస్టోను అమలు చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ మాట్లాడుతూ భీమిలి అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరాడ రాజబాబు, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్నికుమారిలక్ష్మి, దౌలపల్లి ఏడుకొండలరావు, అక్కరమాని రామునాయుడు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా నర్సింగరావు, జనసేన, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు పంచకర్ల సందీప్, కంటుభుక్త రామానాయుడు, కూటమి నాయకులు నూకరాజు, నరేంద్రకుమార్, యోగి, మహాలక్ష్మి, అక్కరమాని దివాకర్, భీమిలి జోనల్ కమిషనరు కనకమహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు

» అధికారుల తీరుపై స్థానికుల విస్మయం
» నగరంలో ఒకలా.. ఇక్కడ మరోలా పనులు
» ప్రమాదాలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి



తొలుత డివైడర్ వేసి, తరువాత తొలగించిన దృశ్యం

సింహాచలం, జూలై 29 : బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ రోడ్డు పనుల్లో గందరగోళం నెలకొంది. నగరమంతా చేపడుతున్న ఈ పనుల్లో మధ్యన రెండు రోడ్లు బస్సుల కోసం, వాటికి ఇరువైపులా ఆటోలు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు నిర్మాణాలు చేపట్టారు. 98వ వార్డులోని పాతగోశాల కూడలి నుంచి పాత అడివివరం కూడలి వరకు జరుగుతున్న పనులు కూడా అదే రీతిన చేపట్టాలని అధికారులు తొలుత భావించి,ఆ ప్రకారమే నిర్మాణం ప్రారంభించారు. గోశాల కూడలి నుంచి సింహాచలం ఆర్‌టీసీ కాంప్లెక్స్ వరకు ఒకవైపు డివైడర్లు వేసుకుంటూ వచ్చారు. ఇంతలో ఏమైందో తెలియదు. వేసిన డివైడర్లను తీసేశారు. దీంతో అసలు ఇక్కడ నిర్మిస్తున్నది రెండు రోడ్లా లేదా మూడా అన్న సందిగ్ధం నెలకొంది. నగరమంతా ఉన్నట్టే ఇక్కడ కూడా మూడు రోడ్లే నిర్మించాలని చాలామంది అభిప్రాయపడుతున్నారు. రెండు రోడ్లు వేయడం వల్ల సర్వీసు రోడ్డు లేకపోతే తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చినవాల్తేరులో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఘనంగా ఎంపీ శ్రీభరత్ జన్మదిన వేడుకలు

పెదవాల్తేరు, జూలై 29 : ఎంపీ శ్రీభరత్ జన్మదినం సందర్భంగా 21వ వార్డు చినవాల్తేరులోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వార్డు టీడీపీ అధ్యక్షుడు పీతల అమరేంద్ర ఆధ్వర్యంలో సోమవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మైనారిటీ నాయకుడు మహమ్మద్ నజీర్, యాసిన్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో ఎంపీ శ్రీభరత్ జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి కేక్ కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, బి. దొరబాబు, సారిపల్లి శ్రీనివాసరావు, కాటూరి వీర్రాజు, అప్పారావు, మంగాదేవి, పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ఇన్‌చార్జి వీసీకి అభినందనలు



శుభాకాంక్షలు తెలియజేస్తున్న సెయింట్ లూక్స్ గ్రూప్ డైరెక్టర్లు

వెంకోజీపాలెం, జూలై 29 : ఏయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి. శశిభూషణరావును ఆయన కార్యాల యంలో సెయింట్ లూక్స్ గ్రూప్ ఆఫ్ ఇనిస్ట్యూషన్స్ డైరెక్టర్లు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు తమ ఇనిస్టిట్యూట్‌లో అమలు చేస్తున్న కోర్సుల గురించి వీసీకి వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిషోర్‌బాబు, ప్రీతమ్ ల్యూక్, ఆశీర్వాద్ ల్యూక్, పీటర్సన్ ల్యూక్ పాల్గొన్నారు.

'ప్రసాదరెడ్డి అక్రమాలపై విచారణ జరపాలి'

వెంకోజీపాలెం, జూలై 29 : నగరంలోని సర్క్యూట్ హౌస్‌లో ఏయూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఎం. సురేష్ మీనన్, తదితరులు స్పీకర్ అయ్యన్నపాత్రుడును సోమవారం కలిసి ఏయూలోని పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సురేష్ మీనన్ మాట్లాడుతూ మాజీ వీసీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అక్రమాలు, అన్యాయాలు, ఆర్థిక అవకతవకలపై న్యాయ విచారణ చేపట్టాలన్నారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ సమస్యలన్నింటిని ఆ శాఖా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

విద్యా రంగం సమస్యలపై యూటీఎఫ్ వినతి

ఆనందపురం, జూలై 29 : విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ కోరారు. సోమవారం ఆయన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోకు వేర్వేరుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో నెంబరు 117ను రద్దు చేసి జీఓ నెంబరు 55 ప్రకారం టీచర్లను కేటాయించాలన్నారు. ప్రీ ప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలగా నడపాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలన్నారు.

పీజీఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

భీమునిపట్నం, జూలై 29 : పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ కార్యక్రమం ఇన్‌చార్జి లక్ష్మీపతి కోరారు. సోమవారం ఆయన ఆర్డీవో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి వారం ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం రెండు వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

విద్యా రంగం అభివృద్ధికి ప్రాధాన్యం

భీమునిపట్నం, జూలై 29 : రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి తొలి ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీని వైసీపీ పాలకులు నిలిపివేయగా తమ ప్రభుత్వం పునరుద్ధరించిందని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. విద్యార్థులకు ఇంటర్ కీలకమైనదని, భవిష్యత్ లక్ష్యాలను ఈ దశలోనే నిర్దేశించుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. సెల్ ఫోన్లు, కంప్యూటర్ టెక్నాలజీని కెరీర్ డెవలప్‌మెంట్ కోసం వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రసాద్, కార్పొరేటర్లు గంటా అప్పలకొండ, గాడు చిన్నికుమారిలక్ష్మి, కూటమి నాయకులు కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్, కంటుభుక్త రామానాయుడు, చిక్కాల విజయ్‌బాబు, కొప్పల రమేష్ పాల్గొన్నారు.

21వ వార్డులో జనసేన సభ్యత్వాల నమోదు

పెదవాల్తేరు, జూలై 29 : చినవాల్తేరులో 21వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షురాలు గుమ్మడి నందితరావు ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వాల నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యత్వాల నమోదుకు ప్రజల నుంచి వస్తున్న స్పందన కారణంగా ఆగస్టు 5వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని జన సైనికులు, వీర మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కృషి, పట్టుదలతోనే లక్ష్య సాధన

వెంకోజీపాలెం, జూలై 29 : కృషి, పట్టుదలతోనే లక్ష్య సాధన సాధ్యమని మాజీ డీజీపీ ఎన్. సాంబశివరావు అన్నారు. సోమవారం ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన ఓరియంటేషన్ అండ్ ఇండక్షన్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. యువత తమ చుట్టూ ఉన్న అవకాశాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఏయూలో ప్రవేశం పొందడం అదృష్టమని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సాంబశివరావును వీసీ శశిభూషణరావు సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య పాల్ డగ్లస్, అంబేడ్కర్ వర్సిటీ మాజీ వీసీ రాంజీ, తదితరులు పాల్గొన్నారు.

బస్సులో ప్రయాణించిన మేయర్



ఆరిలోవ, జూలై 29 : మేయర్ గొలగాని హరి వెంకటకుమారి సోమవారం పెదగదిలిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆర్‌టీసీ బస్సులో కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి సోమవారం ఇంటి నుంచి కార్యాలయానికి బస్సులో వెళ్తున్నానని, నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దే బాధ్యత ప్రజలందరిపై ఉందని చెప్పారు.

తెల్ల పులి దత్తత

ఆరిలోవ, జూలై 29 : అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా జూపార్కులోని తెల్ల పులిని నగరానికి చెందిన ఆర్‌ఎస్‌ఆర్ మిట్టల్ స్టీలు కంపెనీ నిర్వాహకులు సోమవారం రూ. 1.90 లక్షల చెల్లించి ఏడాది పాటు దత్తత తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ హెడ్ డీఎస్ వర్మ, మేనేజర్ సతా రామిరెడ్డి, జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా, ఏసీఎఫ్ మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'శుభదిన్ భోజన్'



అడివివరం ఉన్నత పాఠశాల విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న డీఈఓ చంద్రకళ

సింహాచలం, జూలై 29 : రాష్ట్ర ప్రజలకు అన్నపూర్ణగా పేరొందిన డొక్కా సీతమ్మను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని డీఈఓ ఎల్. చంద్రకళ పిలుపునిచ్చారు. శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా 98వ వార్డులోని అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింహాచలనగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో జరిగిన శుభతిథి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శుభతిథిలో భాగంగా స్థానిక దాతల సహకారంతో సాధారణ భోజనంతో పాటు విద్యార్థులకు పాయసం, స్వీట్లు, అరటి పండ్లు వంటివి అదనంగా అందించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా శాఖ ఆర్జేడీ విజయ్ భాస్కర్, ఏఈపీ శ్రీనివాస్, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఇమ్మంది పైడిరాజు, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ వాంబే కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం భోజనం సమకూర్చారు. అరటి పళ్ళు, స్వీట్లు కూడా పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో . పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు అరటి పళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ 12వ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, పాఠశాల హెచ్‌ఎం దుర్గా భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆనందపురం : విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ ముందుండాలని వేములవలస ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ అన్నారు. వేములవలస ఎంపీపీ పాఠశాలలో ఆయన శుభతిథి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికే శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

పెదవాల్తేరు : ఉన్ను పాయింట్ కాలనీలోని కేడీపీఎం హైస్కూల్లో బీజేపీ విశాఖ పార్లమెంట్ మైనారిటీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి షేక్ నూర్ బాషా షరీఫ్, రాచకొండ దశరథ రామయ్య వైవీజే సుధాకర్ సహకారంతో 650 మంది విద్యార్థులకు అరటి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుమతిబాయి, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతాడ మోహన్‌రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మైనారిటీ మోర్చా ఇన్‌చార్జి శ్రీరంగం దానేష్, శ్రీరాజా మురళీమోహన్, లెంక శ్రీరామ్ పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : పాత వెంకోజీపాలెంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా శుభదిన్ భోజన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాత మళ్ల సన్యాసిరావు సహకారంతో విద్యార్థులకు డ్రైఫ్రూట్ హల్వా, అరటి పండ్లు భోజనంతో పాటు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తగరపువలస : బంగ్లామెట్ట పాఠశాల విద్యార్థులకు దాతలు వివిధ రకాల పదార్థాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అప్పలరాజు, రమేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక పెద్దల సహకారంతో శుభతిథి భోజనం సమకూర్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, శేరిఖండం సర్పంచ్ చిన్నారావు, రెడ్డిపల్లి ఉప సర్పంచ్ ఆదిబాబు, న్యాయవాది ఈశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం సన్యాసిరావు పాల్గొన్నారు.



జడ్పీ కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మూడో వార్డు సరిహద్దులపై స్పష్టత ఇవ్వండి

- జోనల్ కమిషనర్‌కు టీడీపీ నాయకుల వినతి

భీమునిపట్నం, జూలై 29 : పట్టణంలోని మూడో వార్డు సరిహద్దులపై స్పష్టత లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. సోమవారం ఆయన ఈ విషయమై పార్టీ నాయకులతో కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కర వేదికలో జడ్సీ కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేయగా 3వ వార్డు సరిహద్దులో నిడిగట్టు పంచాయతీలోని పలు ప్రదేశాలు ఇప్పటికీ నాలుగో వార్డులో ఉన్నాయని చెప్పారు. అప్పట్లో అధికారులు 3, 4 వార్డుల సరిహద్దులను మ్యాప్ ద్వారా నిర్ణయించారన్నారు. నేరెళ్లవలస కాలనీవాసుల గుర్తింపులో కూడా లోపాలు ఉన్నాయని చెప్పారు. గొల్లలపాలెంలో కల్యాణ మండపం అసంపూర్తిగా ఉందని, దానికి మరమ్మతులు చేసి, అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొక్కిరి అప్పన్న, రాజగిరి రమణ, కందుల సుందరరావు, నొల్లి రమణ, పిల్లా తాతారావు, రేగాని శ్రీను, అల్లిపిల్లి సతీష్, అంగటి సూర్యనారాయణరాజు, వాడమొదలు తవుడయ్య పాల్గొన్నారు. అలాగే కొండపేట పంప్‌హౌస్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు, గణేష్ థియేటర్ నుంచి పైప్‌లైన్ వరకు, సంగివలస నుంచి సామయ్యవలస వరకూ జీవీఎంసీ పైపులైన్లు వేసే సమయంలో గోతులు తవ్వి విడిచిపెట్టడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తగరపువలస పీఏసీఎస్ చైర్మన్ అక్కరమాని రామునాయుడు జడ్సీ దృష్టికి తీసుకువచ్చారు. కాగా జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు పది అర్జీలు రాగా 8 ఇంజనీరింగ్ విభాగానికి, 2 పట్టణ ప్రణాళిక విభాగానికి వచ్చినట్టు జడ్సీ తెలిపారు. కార్యక్రమంలో జోనల్ ఏసీపీ డి. శ్రీనివాసరావు, ఏఈ సుమన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ టీఎం నాయుడు, ఏపీడీ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథన్

సిరిపురం, జూలై 29 : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన వినతులను త్వరగా పరిష్కరించాలని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన వీఎంఆర్డీఏ హాల్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లేఅవుట్లు, భవన నిర్మాణ అనుమతుల మంజూరులో పరిమితులు, విధివిధానాలను చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ రత్నకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జేసీ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 30న లక్ష తులసి పూజ

పద్మనాభం, జూలై 29 : అనంత పద్మనాభుని దేవస్థానంలో వచ్చే నెల 30న ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్ష తులసి పూజ నిర్వహించాలని కమిటీ సభ్యులు తీర్మానించారు. సోమవారం వారు కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో ఈఓ నానాజీబాబు ఆధ్వర్యంలో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ప్రతి ఏడాదిలానే ఈసారి కూడా ఉత్సవాల నిర్వహణకు కమిటీ సభ్యులు సహకరించాలని కోరారు.సమావేశంలో ఆలయ అర్చకుడు పి. సీతారామాంజనేయస్వామి, ఎంపీపీ రాంబాబు, మాజీ ఎంపీపీ గోపీబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేష్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు అప్పలనాయుడు, పైడినాయుడు, నారాయణరావు, ఎర్నాయుడు, పద్మ, సన్యాసిరావు, రాము, నరసింగరావు, అప్పారావు, పైడిరాజు, నసింహనాయుడు, అప్పలరాజు, నారాయణ, రామం, అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఖనిజ తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దు : సీపీఎం

ఆనందపురం, జూలై 29 : మండలంలోని కుసులువాడలో ఖనిజ లోహం క్వారీ మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు మైనింగ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ముందుగా కుసులువాడ సర్వే నెంబరు 104లో 69 ఎకరాల కొండను సందర్శించారు. కొండను కేంద్ర ప్రభుత్వం మైనింగ్‌కి అనుమతులు కోరుతూ రెవెన్యూ అధికారులకు నోట్ పంపడంతో పాటు ఆగస్టు 28న గ్రామంలో అభిప్రాయ సేకరణకు కార్యచరణ సిద్ధం చేసినట్టు పంచాయతీ నోటీసు బోర్డులో అతికించారు. ఈమేరకు నాయకులు కుసులువాడ సచివాలయానికి వెళ్లి వీఆర్వో, కార్యదర్శి ద్వారా క్వారీ అనుమతుల జీవోను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌ను కలిసి క్వారీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు జగ్గునాయుడు మాట్లాడుతూ సర్వే నెంబరు 104లో 69 ఎకరాలను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వడం సరికాదన్నారు. గ్రామంలో నాలుగు వేల మంది నివసిస్తున్నారని, కొండలను మైనింగ్ పేరుతో ధ్వంసం చేస్తే పర్యావరణం కలుషితమై అనేక సమస్యలకు దారి తీస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మైనింగ్ దోపిడీని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి, జోన్ కమిటీ సభ్యులు అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, నాగరాణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతిలోనే విద్యార్థుల భవిష్యత్తు



మాట్లాడుతున్న విద్యాశాఖ ఆర్‌జేడీ విజయ భాస్కర్

ఆరిలోవ, జూలై 29 : చదువులో వెనుకబడిన వారిని గుర్తించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని పాఠశాల విద్యా శాఖ ఆర్‌జేడీ విజయ భాస్కర్ అన్నారు. సోమవారం ఆయన ఆరిలోవలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ఆత్మవిశ్వాసంతో పాటు ఆత్మగౌరవం ఉంటుందని, వారిని నొప్పించేలా వ్యవహరించరాదన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపించకుండా చూడాలని చెప్పారు. సమావేశంలో డీఈఓ ఎల్. చంద్రకళ, ఎంఈఓలు రవీంద్రబాబు, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

వెంకోజీపాలెం, జూలై 29 : జీవీఎంసీ 16వ వార్డులోని 450 గజాల పార్కు స్థలం ఆక్రమణపై భానునగర్ ప్రజలు కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. 1988-89లో సీతమ్మధార నుంచి వెంకోజీపాలెం వరకు రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన 127 మందికి భానునగర్‌లో స్థలాలు ఇచ్చారు. ఈ లేఅవుట్‌లో 450 గజాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు. ఈ స్థలం ఆక్రమణకు గురవ్వడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషనర్ తక్షణమే స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వంకా శివశంకర్, జి. వామనమూర్తి, అడ్వకేట్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఐదో వార్డు సమస్యలపై వినతి

కొమ్మాది, జూలై 29 : జీవీఎంసీ 5వ వార్డు అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే గంటాకు, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వేర్వేరుగా వినతులు అందజేశారు. వార్డులో అసంపూర్తిగా ఉన్న కల్యాణ మండపాలను పూర్తి చేయాలని, బొట్టవానిపాలెంలో గతంలో శంకు స్థాపన చేసిన సామాజిక భవనం పూర్తి చేయాలని, కొండవాలు ప్రాంతాలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు.